



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల

## వేడుకలకు హాజరుకండి


- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి లోకేష్ ఆహ్వానం

7

# ప్రతి నిర్ణయమూ రైతు కోసమే

- ఐటీ గురించి మాట్లాడినా... వ్యవసాయంపైనే ఆలోచన
- సాగును లాభదాయకంగా చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతి నెలా పొలాలను సందర్శించాలి
- మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులుండాలి
- మైక్రో, డ్రిప్ ఇరిగేషన్‌తో నీరు, వనరుల ఆదా
- రసాయన ఎరువుల అధిక వినియోగంతో ప్రజారోగ్యం, పంట ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ట్రంప్ కారణంగా విలవిలలాడుతున్న ష్రింప్
- ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి
- రూ.1000 కోట్ల భారమైనా ఆక్వాను ఆదుకునేలా చర్యలు
- మరో గేమ్‌ఛేంజర్‌గా ఉద్యాన రంగం
- వ్యవసాయ, ఉద్యాన రంగాలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

2



## సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు

- భవిష్యత్ తరాలను అభివృద్ధి వైపు నడిపించే సంస్కరణలు
- పొదుపుతో పాటు సంపద సృష్టికి దోహదం
- ఆదా అయ్యే సొమ్ముతో అభివృద్ధి చెందాలి
- తగ్గిన ధరలతో ఆనందంగా దసరా-దీపావళి పండుగలు
- జీఎస్టీ సంస్కరణల లాభాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం
- దసరా నుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు
- 65 వేలకు పైగా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు
- జీఎస్టీ సంస్కరణల ప్రచారంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

3

## జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి ఊతం

- ❑ 75 ఏళ్ల ప్రస్థానానికి వరుణ్ గ్రూప్‌నకు శుభాకాంక్షలు
- ❑ డైమండ్ జూబ్లీ వేడుకల్లో సీఎం చంద్రబాబు
- ❑ సంస్థ అధినేత ప్రభుకిశోర్ జీవిత చరిత్ర The Winnarian ఆవిష్కరించిన సీఎం

3




## ఈ- గవర్నెన్స్‌తో అద్భుతాలు

- సాంకేతికతతో.. ప్రజలకు మరింత చేరువగా పాలన
- పాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యం
- వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఏపీలో 751 పౌరసేవలు
- క్వాంటం టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి
- ప్రధాని స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నాం
- విశాఖలో జరిగిన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో సీఎం చంద్రబాబు

4

మన సంస్కృతి, చరిత్ర, కళలు...

## నేటి తరానికి చాటేలా ‘విజయవాడ ఉత్సవ్’



- దసరా ఉత్సవాలంటే విజయవాడ గుర్తుకురావాలి
- ప్రతి సంవత్సరం నిర్వహించాలి
- ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం
- పున్నమిఘాట్‌లో నిర్వహించిన ‘విజయవాడ ఉత్సవ్’ ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి

5

ప్రభుత్వ పాఠశాలల ఎదుట

## నో అడ్మిషన్ బోర్డులు

*అదే తన లక్ష్యమని మంత్రి లోకేష్ ఉద్ఘాటన*



- గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 117తో 10లక్షల మంది పేద విద్యార్థులు చదువుకు దూరం
- ప్రత్యామ్నాయంగా వన్ క్లాస్ - వన్ టీచర్ విధానాన్ని తీసుకువచ్చాం
- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

6

మంత్రి నారా లోకేష్ చొరవతో

## పొలం వదిలి... కలం పట్టిన చిన్నారి

- చిట్టితల్లి జెస్సీ చిలకలడోన కేజీబీవీలో చేరిందోచ్!
- హామీ ఇచ్చిన 24 గంటల్లో జెస్సీ చదువు కల సాకారం
- మాట నెరవేర్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



7

అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ


## అమరావతిలో 24 నెలల్లో సిద్ధం

- కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా గ్రంథాలయాలు
- తుది దశలో మంగళగిరి మోడల్ లైబ్రరీ
- 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మోడల్ లైబ్రరీలు
- శాసనసభలో మంత్రి నారా లోకేష్

6

# ప్రతి నిర్ణయమూ రైతు కోసమే

- ఐటీ గురించి మాట్లాడినా... వ్యవసాయంపైనే ఆలోచన
- సాగును లాభదాయకంగా చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతి నెలా పొలాలను సందర్శించాలి
- మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులుండాలి
- మైక్రో, డ్రిప్ ఇరిగేషన్‌తో నీరు, వనరుల ఆదా
- రసాయన ఎరువుల అధిక వినియోగంతో ప్రజారోగ్యం, పంట ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ట్రంప్ కారణంగా విలవిలలాడుతున్న ష్రింప్
- ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి
- రూ.1000 కోట్ల భారమైనా ఆక్వాను ఆదుకునేలా చర్యలు
- మరో గేమ్‌ఛేంజర్‌గా ఉద్యాన రంగం
- వ్యవసాయ, ఉద్యాన రంగాలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్



అమరావతి (చైతన్యరథం): నేను ఎప్పుడు ఐటీ గురించే మాట్లాడతానని అనుకుంటారు.. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని.. నేను చేసిన పనులన్నీ రైతులకు ఉపకరించేవే.. నీరు-చెట్టు, రిజర్వాయర్లు, చెక్ డ్యాములు, కాలువలు ఇలా ప్రతీ అంశంలోనూ వ్యవసాయ రంగానికి అనుకూలమైన ఆలోచనలే చేశా.. సాగునీరు, వ్యవసాయ రంగం అభివృద్ధికే నిర్ణయాలు తీసుకున్నాను.. రైతు బజార్లు, మొబైల్ రైతు బజార్లలో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేలా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే వ్యవసాయ శాఖపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు.. రైతులకు లబ్ధి చేకూర్చిన అంశాలను చెప్పడంతో పాటు.. భవిష్యత్తులో రైతు సంక్షేమం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నామనే విషయాలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రతి నిర్ణయమూ రైతు కోసమే తీసుకుంటున్నానని, వ్యవసాయాన్ని లాభదాయకం చేసే అంశం మీదే ప్రతి నిమిషం ఆలోచిస్తున్నానని స్పష్టం చేశారు. వ్యవసాయం మీద ఆధారపడే ఆర్థిక వ్యవస్థ మనది. అందుకే ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలని నిర్ణయించాం. ప్రతి పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చూస్తున్నాం. అందుకే రకరకాల పంటలను ప్రోత్సహిస్తున్నాం. ఆక్వాను ప్రోత్సహిస్తున్నాం. వ్యవసాయాన్ని ఓ పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తున్నాం. వ్యవసాయం లాభసాటిగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం.. ఏ పంట వేస్తే గిట్టుబాటు ఉంటుందో చూసి ఆ పంటలు వేసేలా ప్రోత్సహిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు.

## ప్రజా ప్రతినిధుల పొలం బాట

ప్రతీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నెలకు ఒక్క రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలి. అక్టోబరు నుంచి ప్రతీ నెలా రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు విని పరిష్కారం చేస్తాం. ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తాం. ప్రజా ప్రతినిధులు.. రైతుల వద్దకు వెళ్లి వారి గురించి ప్రభుత్వం ఎలాంటి ఆలోచనలు చేస్తోంది, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటోందనేది వివరించాలి. ప్రతీ ప్రజా ప్రతినిధి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాం. పురుగు మందులు, ఎరువుల వాడకంలో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ ఉంది. తెగుళ్లను గుర్తించి నివారణ చర్యల కోసం డ్రోన్లను వాడొచ్చు. అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల ఆక్వాలో అగ్రస్థానంలో ఉన్న ఏపీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. రైతులకు సంపద రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సాగు వ్యయాన్ని తగ్గించడానికి టెక్నాలజీతో రైతును ఆదుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## యూరియాపై రైతులను మోసగిస్తున్న నేతలు

రైతులకు వాస్తవాలు చెప్పి పురుగుమందులు, ఎరువులు ఎక్కువగా వాడుతుంటే వారికి అవగాహన కల్పించాలి. వరదలు, వర్షాలతో ఎరువు కొట్టుకుపోవటం వల్ల బూస్టర్ డోస్ ఇచ్చారు. రాష్ట్రంలో 1.16 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది అదనంగా పంట వేశారు. 25 శాతం మేర యూరియా ఎక్కువ వినియోగించారు. దాణా పెంచడానికి కూడా యూరియాను వినియోగించుకున్నారు. ఖరీఫ్ సీజన్‌కు 16.70 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా అలాట్మెంట్ వచ్చింది. ప్రస్తుతం 5.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రంలో అందుబాటులో ఉంది. యూరియా ఎక్కువ వినియోగించటం వల్ల పాలు కూడా కలుషితం అవుతున్నాయి. యూకలిప్టస్, పసుపు లాంటి పంటలకు కూడా యూరియా వాడేస్తున్నారు. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 255 కేజీల మేర యూరియా వినియోగం జరుగుతోంది. తద్వారా భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. భూసారం కూడా దెబ్బతింటోంది. ప్రజారోగ్యంతో పాటు పంట ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతోంది. కొత్త తెగుళ్లతో పంటలు దెబ్బతింటున్నాయి. రసాయనాలు, యూరియా అధిక వినియోగంపై రైతుల్ని చైతన్యపర్చాల్సి ఉంది. ఫెర్టిలైజర్ల వినియోగం వల్ల మార్కెట్ ఉండదు. పీఎం ప్రణామ్ కింద రసాయన ఎరువుల వినియోగం తగ్గించిన రైతులకు రూ.800 సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాకే బదిలీ చేస్తాం. టెస్టింగ్ అండ్ ట్రేసింగ్ వల్ల రైతులు నష్టపోకూడదు. బాధ్యతలేని నాయకులు ఎరువులు ఇవ్వలేదంటూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికేషన్ ఇచ్చిన ఆహారాన్నే తీసుకుంటున్న ఆ నేతలు రైతులను మోసగిస్తున్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న రైతు ప్రభుత్వం కూటమిది. రైతులు ఉత్పత్తి చేసే పంటలపై శ్రద్ధపెట్టాలి, సేంద్రియ ఎరువులు ఉపయోగించి, రసాయన పురుగు మందులు తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు పండిద్దామని సీఎం చంద్రబాబు సూచించారు.

## నీటి వసతి పెంచాం... సాగు విస్తీర్ణం పెరిగింది

సమర్థ నీటి నిర్వహణ కారణంగా అన్ని రిజర్వాయర్లల్లో నీటితో కళకళలాడుతున్నాయి. నెల్లూరులో ఎప్పుడూ ఒక పంటే వేస్తారు. ఈసారి అక్కడ రెండు పంటలు వేశారు. రైతులకు సమృద్ధిగా నీరు అందుతుండడంతో పంటలు విరివిగా వేస్తున్నారు. అదే దిశలో మేమూ రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాం. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో వేస్తున్నాం. తొలి విడతగా రూ.7 వేల చొప్పున మొత్తంగా రూ.3173 కోట్లు రైతుల ఖాతాలో వేశాం. ఉల్లి ధరలు పడిపోతే హెక్టారుకు రూ.50 వేల నష్ట పరిహారం ప్రకటించాం. ఈ స్థాయిలో ఉల్లి పంటకు నష్టపరిహారం గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. అలాగే టమాటో ధర పడిపోయినా... ప్రభుత్వం 1267 మెట్రిక్ టన్నుల టమాటాలను కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. మామిడికి రూ.194 కోట్ల మేర అదనంగా చెల్లింపులు చేసి రైతును ఆదుకున్నాం. మిర్చి, కోకో, పత్తి, పొగాకు రైతులను అన్ని రకాలుగా ఆదుకున్నాం. ప్రకృతి సేద్యాన్ని కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ప్రతీ ఎకరాకూ నీటిని ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాం. అగ్రిటెక్‌లో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణకు ఎక్కువ ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. కిసాన్ డ్రోన్స్ ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నాం. రుతుపవనాల కారణంగా ఈసారి చాలా చోట్ల భారీ వర్షాలు కురిశాయి. మైక్రో ఇరిగేషన్, డ్రిప్ ఇరిగేషన్‌లో ఏపీ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉంది. అనంతపురంలో అమలు చేసిన మైక్రో, డ్రిప్ ఇరిగేషన్‌ను నమూనాగా తీసుకుని ప్రధాని మోదీ గుజరాత్‌లో అమలు చేశారు. అందుకే దేశంలో ఈ రెండు రాష్ట్రాలు మైక్రో ఇరిగేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్నాయి. మైక్రో ఇరిగేషన్ వినియోగించే రైతులకు 90 శాతం సబ్సిడీని అందిస్తున్నాం. మైక్రో ఇరిగేషన్ ద్వారా లక్ష హెక్టార్లకు 15 టీఎంసీల నీరు ఆదా అవుతుంది. ఏడేళ్లలో 105 టీఎంసీల నీరు ఆదా అయినట్టే. అలాగే రూ.434 కోట్ల విలువైన 10,871 లక్షల కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుంది. అలాగే 364 లక్షల పని దినాలు కూడా ఆదా చేసుకున్నట్టే. దీని విలువే రూ.1820 కోట్ల మేర ఉంటుంది. 35 వేల టన్నుల యూరియా కూడా రైతులకు ఆదా అవుతుంది. మొత్తంగా రూ.8 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని రైతులు సాధించినట్టే. ఉద్యాన రంగానికి సంబంధించి క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఫుడ్ ప్రాసెసింగ్ పైనా ప్రధానంగా దృష్టి పెట్టాం. ఈ రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా గరిష్టంగా ఆదాయం సాధించే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు.

## మెరైన్ ఎకానమీపై శ్రద్ధ పెడతాం

ఆక్వా కల్చర్‌తో పాటు వ్యవసాయ ఉత్పత్తుల్లోనూ ఏపీ నెంబర్ వన్‌గా మారే పరిస్థితి తీసుకువస్తాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు ష్రింప్ (రొయ్య) విలవిల లాడుతోంది. రూ.21 వేల కోట్ల ఆక్వా ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. అమెరికా టారిఫ్‌లు పెరిగిపోవటం వల్ల ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నాం. రిజిస్ట్రేషన్లు చేసుకుంటే... జోన్లకు అతీతంగా అక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందిస్తున్నాం. రూ. 1000 కోట్ల భారం పడినా ఆక్వా రైతును అదుకునేలా చర్యలు చేపట్టాం. ఆక్వా ఫీడ్ కూడా కేజీకి రూ.9 చొప్పున ధర తగ్గించేలా కంపెనీలతో మాట్లాడాం. ఆక్వాకు కొత్త మార్కెట్లను అన్వేషించేలా కేంద్రంతో సంప్రదింపులు జరిపాం. ప్రత్యామ్నాయంగా దేశీయంగా వినియోగాన్ని పెంచేలా చూస్తాం. మెరైన్ ఎకానమీని పెంపొందించడంలో భాగంగా సీవీడ్ కల్చర్‌పై కూడా దృష్టి పెడుతున్నాం. ఈ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. సీ వీడ్ ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పారు.

### అతి పెద్ద ఆదాయ వనరు

## వ్యవసాయ రంగమే

రాష్ట్రంలో 35 శాతం జీఎస్డీపీ వ్యవసాయ ఆధారితంగానే వస్తోంది. వ్యవసాయ రంగం ద్వారా రూ. 5.17 లక్షల కోట్లు, పారిశ్రామిక రంగం ద్వారా రూ. 3.40 లక్షల కోట్లు, సేవల రంగం ద్వారా రూ. 6.12 లక్షల కోట్ల గ్రాస్‌వాల్యూ ఎడిషన్ వస్తోంది. ఒక్క పశు సంవర్ధక రంగం నుంచే రూ.1.95 లక్షల కోట్ల జీవీఏ వస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవల రంగం నుంచి రూ. 17.12 లక్షల కోట్ల జీవీఏను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ రంగాల్లో 17.11 శాతం వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆహార అలవాట్లు మారుతున్నాయి. దీనికి అనుగుణంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాల్సి ఉంది. రాష్ట్రంలో లైవ్‌స్టాక్ ద్వారా 19 లక్షల మందికి నేరుగా జీవనోపాధి కలుగుతుంది. భవిష్యత్తులో అతిపెద్ద ఆర్థిక లావాదేవీలకు ఆస్కారం ఉన్న రంగంగా లైవ్ స్టాక్ ఉంటుంది. ఉద్యాన రంగం రాష్ట్రంలో రెండో గేమ్ ఛేంజర్‌గా మారుతుంది. 18.57లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నాం. కూరగాయలు, పండ్లు, మసాలా దినుసులు, తదితరాలను పెద్ద ఎత్తున పండించుకునే అవకాశం ఉంది. హార్టికల్చర్, ఆక్వా కల్చర్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చే రంగాలుగా మారతాయి. 2029 నాటికి రాష్ట్రంలో ఉద్యాన పంటలను 25 లక్షల హెక్టార్లకు పెంచుతాం. సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ దేశానికి హార్టికల్చర్ హబ్ గా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

# సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు

- భవిష్యత్ తరాలను అభివృద్ధి వైపు నడిపించే సంస్కరణలు
- పొదుపుతో పాటు సంపద సృష్టికి దోహదం
- ఆదా అయ్యే సొమ్ముతో అభివృద్ధి చెందాలి
- తగ్గిన ధరలతో ఆనందంగా దసరా-దీపావళి పండుగలు
- జీఎస్టీ సంస్కరణల లాభాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం
- దసరా నుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు
- 65 వేలకు పైగా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు
- జీఎస్టీ సంస్కరణల ప్రచారంపై సభలో సీఎం చంద్రబాబు ప్రకటన



అమరావతి (చైతన్యరథం): సూపర్ జీఎస్టీతో ప్రజలకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎలా మేలు జరిగిందో... అదే విధంగా ప్రస్తుత సంస్కరణలతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సూపర్ జీఎస్టీగా మార్చిందని.. దీని ద్వారా కూడా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని సీఎం వివరించారు. సుమారు రూ.8,000 కోట్లు రాష్ట్ర ప్రజలకు ఆదా అవుతుందని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల మూడోరోజు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ప్రచార కార్యక్రమాలపై ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ఫలాలు రాష్ట్ర ప్రజలందరికీ అందేలా మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రతి ఇంటికీ తెలిసేలా ప్రచారం నిర్వహిస్తాం. 65 వేలకు పైగా సమావేశాలు, అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని వివరించారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చటమే లక్ష్యంగా జీఎస్టీ సంస్కరణలు తెచ్చారు. 2047 నాటికల్లా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాల సాధనకు జీఎస్టీ సంస్కరణలు, సూపర్ సిక్స్ , పీ4 కార్యక్రమాలు శక్తివంతంగా పని చేస్తాయి. నిత్యావసర వస్తువుల్లో 99 శాతం వస్తువులపై సున్నా శాతం పన్ను ఉంది. చిన్నచిన్న వ్యాపారాలకు లబ్ధి కలుగుతుంది. ఎంఎస్ఎంఈలకు జీఎస్టీ సంస్కరణల వల్ల పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. స్వదేశీ, మేక్ ఇన్ ఇండియా నినాదాలకు ప్రత్యక్షంగా నెక్స్ట్ జెన్ జీఎస్టీ సంస్కరణలు తోడ్పడతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సహకారం లభిస్తుంది. గ్లోబల్ బ్రాండ్లుగా భారతీయ ఉత్పత్తులు పోటీ పడేందుకు ఆస్కారం కలుగుతుంది. భారతీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశాభివృద్ధిలో నేరుగా భాగస్వాములైనట్టే. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.

### పొదుపు ఓ వైపు... అభివృద్ధి మరోవైపు

సంస్కరణలతో అభివృద్ధి, సంపద సృష్టి జరిగే అవకాశం ఉంటుంది. నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, ఔషధాలు, విద్య, స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు, క్రీడా వస్తువులు, మహిళలు.. చిన్నారులకు ఉపయోగపడే వస్తువులు, రవాణా, హోటళ్లు ఇలా వేర్వేరు రంగాల్లో పన్నులు తగ్గుతాయి. వ్యవసాయ ఉపకరణాల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించాం. 10 వేల రైతు సేవా కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తాం. రాష్ట్రంలో ప్రతీ పౌరుడికీ వివరాలు తెలిసేలా అన్ని టచ్ పాయింట్లు ఏర్పాటు చేస్తాం. విద్యా సంస్థలు, కళాశాలల్లో వ్యాస రచనా పోటీలు నిర్వహిస్తాం. సోమవారం నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు 26 జిల్లాల్లో జీఎస్టీ సంస్కరణలపై ప్రచారం చేస్తాం. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడతాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఇలా వేర్వేరు వర్గాలతో విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించాం. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచారం, హోర్డింగులు, మాస్ అవుట్ రీచ్ ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా ద్వారా సెల్ఫీ కంటెస్ట్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రచారం చేపడతాం. అలాగే సాండ్ ఆర్ట్ వంటి వాటి ద్వారా కూడా ప్రచారం చేపడతాం. జీఎస్టీ సంస్కరణలపై సెమినార్లను కూడా నిర్వహిస్తాం. దుకాణాల వద్ద కూడా జీఎస్టీ తర్వాత తగ్గింపు ధరలను కూడా ప్రదర్శించేలా చూస్తాం. జీఎస్టీ 2.0 సంస్కరణలు భవిష్యత్ తరానికి ఉపకరిస్తాయి. స్వర్ణాంధ్ర దిశగా అన్ని వర్గాలనూ నడిపించేలా ఈ సంస్కరణలు ఉన్నాయి. ప్రజలందరికీ దసరా, దీపావళి పండుగ శుభాకాంక్షలు. తగ్గిన ధరలతో అందరూ ఆనందంగా ఈ పండుగలు జరుపుకోవాలని కోరుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి ఊతం

- 75 ఏళ్ల ప్రస్థానానికి వరుణ్ గ్రూప్‌నకు శుభాకాంక్షలు
- డైమండ్ జూబ్లీ వేడుకల్లో సీఎం చంద్రబాబు
- సంస్థ అధినేత ప్రభుకిశోర్ జీవిత చరిత్ర The Winnarian ఆవిష్కరించిన సీఎం



విజయవాడ (చైతన్యరథం): ఆటోమొబైల్ రంగం మరింతగా అభివృద్ధి చెందడానికి జీఎస్టీ సంస్కరణలు ఉపకరిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వరుణ్ గ్రూప్ ఏర్పడి 75 ఏళ్ల పూర్తైన సందర్భంగా విజయవాడలో సోమవారం జరిగిన సంస్థ డైమండ్ జూబ్లీ వేడుకలకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఆ సంస్థ అధినేత ప్రభు కిశోర్ జీవిత చరిత్ర The Winnarian ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగం సహా ఏపీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. రాష్ట్రాన్ని భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ఏపీ నుంచే పెద్ద ఎత్తున ఉత్పత్తులు ఎగుమతి చేసేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం. ఆటోమొబైల్ రంగంలో వరుణ్ గ్రూప్ ఎంతో ప్రగతి సాధించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తెచ్చింది. ఈ సంస్కరణలు ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి తొడ్పడతాయి. కొన్ని సంస్థలు మొదటి జనరేషన్‌లో మరికొన్ని రెండో జనరేషన్‌లో దెబ్బతిన్నాయి. చాలా తక్కువ సంస్థలే దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగాయి. అలాంటి వాటిలో ఒకటి వరుణ్ గ్రూప్. నేటి పోటీ ప్రపంచంలో ఒక సంస్థ 75 ఏళ్ల ప్రస్థానమంటే అంత తేలికైన విషయం కాదంటూ ఆ ఘనత సాధించిన వరుణ్ గ్రూప్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు.

### కృష్ణా జిల్లా వాసులు తెలివైనవారు

75 ఏళ్ల క్రితం వరుణ్ గ్రూప్ ఇదే విజయవాడ నుంచి విజయయాత్ర మొదలుపెట్టి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాంతం వాళ్లు అత్యంత తెలివైన వాళ్లు, సమర్థులు. కృష్ణాజిల్లా వాసులు దేశ, విదేశాల్లో వ్యాపార, వాణిజ్య, విద్యా, సినీ రంగాల్లో అద్భుతంగా రాణించారు. ఇప్పుడు అమరావతి రాజధాని అయింది కాబట్టి విదేశాలు వెళ్లిన ఈ జిల్లావాసులు మళ్లీ వస్తారు. విశాఖ, విజయవాడల్లో అత్యుత్తమ హోటళ్లు నిర్మించిన ప్రభుకిషోర్ అమరావతిలో కూడా నోవాటెల్ హోటల్‌కు శంకుస్థాపన చేయడం శుభ పరిణామం. వేలాది మంది యువతకు వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి సహా పలువురు పారిశ్రామికవేత్తలు, వరుణ్ గ్రూప్ సిబ్బంది హాజరయ్యారు.







# సాంకేతికతతో.. ప్రజలకు మరింత చేరువగా పాలన

- పాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యం
- వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఏపీలో 751 పౌరసేవలు
- క్వాంటం టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి
- ప్రధాని స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నాం
- విశాఖలో జరిగిన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో సీఎం చంద్రబాబు




విశాఖపట్నం (చైతన్యరథం): పాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యమైన అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాంకేతికతతోనే ప్రజలకు పాలను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ఐటీ, సమాచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు తొలిరోజు సోమవారం సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్ సర్వీసెస్ -డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో జరుగుతున్న 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా అందే పౌర సేవలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతికత కీలకమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఐటీ, ఈ - గవర్నెన్స్ అంశాలతో పాలనలో అనేక మార్పులు వచ్చాయన్నారు. కమ్యూనికేషన్ సంస్కరణల ద్వారా ప్రజా జీవనంలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని గతంలోనే ఉమ్మడి ఏపీలో ఈ-సేవ, మీ-సేవ ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లామని సీఎం గుర్తుచేశారు. ఈ-ఫైల్స్, ఈ-కేబినెట్ లాంటి అంశాలతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. అలాగే ఈ వ్యవస్థలను అమలు చేసే సమయంలో సైబర్ సెక్యూరిటీ కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఐటీతో వచ్చిన విస్తృత ప్రయోజనాలను అందిపుచ్చుకోగలుగుతున్నామన్నారు. ఈ ప్రక్రియను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మనమిత్ర వాట్సప్ గవర్నెన్సును అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. మొత్తం 751 పౌరసేవల్ని వాట్సప్ ద్వారా పౌరులకు అందిస్తూ పాలనను వారి మొబైల్ ఫోన్ల వరకూ తీసుకెళ్లామని స్పష్టం చేశారు. మరోవైపు సాంకేతికత కారణంగా పొరుగు రాష్ట్రాలతోనూ పోటీ పెరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు.

## సంజీవని ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అమలుకు అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలతో కలిసి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు.



క్వాంటం కంప్యూటర్ సేవలను ప్రభుత్వాలు, విద్య, వైద్య సంస్థలు వినియోగించుకునే అవకాశం ఉందని సీఎం సూచించారు. క్వాంటం వ్యాలీతో ఇక్కడ ఒక ఎకో సిస్టం ఏర్పాటు అవుతోందని సీఎం తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు, పరికరాల తయారీ సంస్థలు కూడా పెట్టుబడులతో ముందుకు వచ్చాయని వివరించారు. టెక్నాలజీ పరంగా సేవలు, ఉద్యోగాలు, ఉత్పాదన, తదితర రంగాలు కూడా వేగంగా మారుతున్నాయని ఈ పరిస్థితుల మధ్య వచ్చే 10 ఏళ్ల కాలం మన దేశానికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రధాని మోదీ ఇచ్చిన స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపిన ముఖ్యమంత్రి.. దానికి అనుగుణంగా దేశంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్‌గా మారాలన్నారు. ఏపీలో వైద్య సేవలను టెక్నాలజీతో అనుసంధానం చేసే సంజీవని ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని.. త్వరలో ఈ వ్యవస్థను మొత్తం దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు అస్కారం ఉందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు ఏ మేరకు ఈజ్ ఆఫ్ లివింగ్‌ను చేరువ చేశామన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గతంలో బీపీఓ విధానాన్ని అందిపుచ్చుకోవటం ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని ఇప్పుడు కొన్ని యాప్‌ల ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు విదేశాలకు వెళు_తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీలో మరో కీలకమైన అంశంగా సెమికండక్టర్ల పరిశ్రమ పైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఓ సెమీ కండక్టర్ పరిశ్రమను ఏపీకి కేటాయించటంపై ప్రధానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. సమీప భవిష్యత్తులో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్కుల ద్వారా జాతీయ అభివృద్ధిలో ఏపీ కూడా ప్రధాన భాగస్వామి అవుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ ఏపీ సంచికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఎస్ కె.విజయానంద్ తో పాటు కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.





## మన సంస్కృతి, చరిత్ర, కళలు...

# నేటి తరానికి చాటేలా 'విజయవాడ ఉత్సవ్'

- దసరా ఉత్సవాలంటే విజయవాడ గుర్తుకురావాలి
- ప్రతి సంవత్సరం నిర్వహించాలి
- ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం
- పున్నమిఘాట్‌లో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్' ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి



విజయవాడ(చైతన్యరథం): మన సంస్కృతి, చరిత్ర, కళలు ఈ తరానికి తెలియజేసేందుకు 'విజయవాడ ఉత్సవ్' తోడ్పడుతుంది.. దసరా ఉత్సవాలంటే ఇప్పటి వరకు మైసూర్ ఉత్సవాల గురించి మాట్లాడుకునే వారు..ఇకపై దసరాఉత్సవాలంటే'విజయవాడ ఉత్సవ్' గురించి మాట్లాడుకునేలా వేడుకలను ఘనంగా నిర్వహించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ఆధ్వర్యంలో విజయవాడ పున్నమి ఘాట్‌లో సోమవారం నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్' ప్రారంభోత్సవ వేడుకల్లో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మంత్రి లోకేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వెంకయ్యనాయుడి తో కలిసి విజయవాడ ఉత్సవ్ వేడుకలను మంత్రి లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. జై భవాని.. రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. భక్తులు కోరిన కోరికలు తీర్చే తల్లి దుర్గమ్మ. కొండ మీద దుర్గమ్మ, కొండ కింద కృష్ణమ్మ ఉన్న పుణ్యభూమి ఉమ్మడి కృష్ణా జిల్లా. విజయవాడ పేరులోనే విజయం ఉంది. దుర్గమ్మను దర్శించుకొని ఏ పని ప్రారంభించినా విజయమే. వెంకయ్యనాయుడిని చూస్తూ పెరిగాను. ఆయన పట్టుదలను చూస్తే ఏమైనా సాధించవచ్చని అనిపిస్తుంది. ఆంధ్రా యూనివర్సిటీలో స్టూడెంట్ లీడర్‌గా తన ప్రయాణం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా, కేంద్ర మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా సేవలు అందించారు. తెలుగుభాషను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేశారు. ఆయన పోరాటం వల్లే ఆంధ్ర రాష్ట్రంలో జీవోలన్నీ తెలుగులో ఇస్తున్నారని మంత్రి లోకేష్ అన్నారు.

### వాజ్ పేయి, అద్వానీ, మోదీతో కూడా పనిచేసిన గొప్ప నాయకుడు

వెంకయ్య నాయుడు ఒక పని అనుకుంటే అది అయ్యేవరకు వదిలిపెట్టరు. ఆయనపై మాటలతో, వాదనలతో గెలిచిన వారు ఎవరూ లేరు. మనం ఎవరం మాట్లాడినా పది నిమిషాల తర్వాత బోర్ కొడుతుంది. కానీ వెంకయ్యనాయుడు గంట సేపు ఉపన్యాసం ఇచ్చినా విసుగు పుట్టదు. అందరినీ నవ్విస్తూ ఉంటారు. వయసు ఒక సంఖ్య మాత్రమే. ఆయన స్పీడ్ చూసి ఈరోజుకి కూడా నేను అసూయ పడుతున్నాను. ఎప్పుడు చూసినా పని తప్ప వేరే ఆలోచనలు ఆయనకు ఉండవు. సీఎం చంద్రబాబుతో పోటీ పడాలని అనుకుంటున్నా.. నా వల్ల కావడం లేదు. అదే పరిస్థితి వెంకయ్యనాయుడుతో కూడా ఉంది. స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా వైద్యం, విద్య, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారు. నాటి తరం నేతలు వాజ్‌పేయి, అద్వానీ నుండి ప్రస్తుత ప్రధాని మోదీతో కూడా కలిసి పని చేసిన గొప్ప నాయకుడు వెంకయ్యనాయుడు అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### కళాకారులకు అద్భుతమైన వేదిక

సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ఆధ్వర్యంలో విజయవాడ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. మన సంస్కృతి, చరిత్ర, కళలు ఈ తరానికి తెలియజేసేందుకు విజయవాడ ఉత్సవ్ తోడ్పడుతుంది. రాష్ట్రంలోనే కాకుండా,దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులు వారి కళలను ప్రదర్శించేందుకు ఒక అద్భుతమైన వేదికగా విజయవాడ ఉత్సవ్ నిలవబోతోంది. దాదాపు మూడు వేలమంది కళాకారులు, 30 కళారూపాలతో కోలాహలంగా రికార్డ్‌స్థాయిలో ఉత్సవ ఊరేగింపు (కార్నివాల్) నిర్వహించబోతున్నాం. ఇప్పటికే కృష్ణా తీరాన ఆకాశ వీధుల్లో కళ్ళు మిరుమిట్లు గొలిపే ఫైర్ వర్క్ షో, డ్రోన్ షో,మ్యూజికల్ కాన్సర్ట్‌లను చూశాం. పదకొండు రోజులపాటు ఐదు ప్రధాన వేదికలలో 250కి పైగా కార్యక్రమాలను ఈ విజయవాడ ఉత్సవ్‌లో వీక్షించ బోతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

### దసరా ఉత్సవాలంటే విజయవాడ గుర్తుకురావాలి

వ్యవసాయ, వాణిజ్య, విద్య, ఆటో మొబైల్, చేనేత రంగాలకు చెందిన దాదాపు ఆరువందల స్టాల్స్‌తో భారీ ఎక్స్‌పో మనం ఏర్పాటుచేసుకున్నాం. హెలికాప్టర్ రైడ్స్,పారామోటరింగ్ ఏర్పాటు చేశాం. ఆంధ్రా భోజనంతో పాటు దేశంలోని అన్నిరకాల వంటకాలను విజయవాడకు తీసుకువచ్చాం. ఇప్పటివరకు దేశం మొత్తం మైసూర్ ఉత్సవాల గురించి మాట్లాడేవారు. ఇప్పుడు దసరా ఉత్సవాలంటే విజయవాడ ఉత్సవాల గురించి మాట్లాడుకుంటారు. ఆవిధంగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నా.ఎక్కడికి వెళ్లినా నన్ను గుర్తుపడతారు. అందుకే ఈ ఉత్సవాల్లో పాల్గొనాలంటే నాకు కొంచెం ఇబ్బందికరం. లండన్‌లో వింటర్ వండర్ ల్యాండ్ అని ఉంది. అక్కడికి నేను 2019లో వెళ్లాను. దశాబ్దాలుగా అక్కడ అద్భుతంగా నిర్వహిస్తున్నారు. కేవలం వన్ టైం వండర్‌గా కాకుండా ప్రతి సంవత్సరం విజయవాడ ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించాలని కోరుకుంటున్నాను.ఇదొక శాశ్వతఆకర్షణగా ఉండాలి. టూరిజంను పెద్దఎత్తున ప్రోత్సహించాలి. అమరావతి పనులుకూడా వేగంగా జరుగుతున్నాయి. విజయవాడ కేంద్రంగా ఒక కల్చరల్ ఫెస్ట్‌గా విజయవాడ ఉత్సవ్ మారాలని నిర్వాహకులను కోరుతున్నాను. ప్రభుత్వ పరంగా మా సహకారం ఎప్పుడూ ఉంటుంది. ప్రత్యేకంగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిని అభినందిస్తున్నా. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని మంత్రి లోకేష్ ప్రశంసించారు.

### ప్రముఖులకు సత్కారం

విజయవాడ ఉత్సవ్‌ను పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను ఘనంగా సత్కరించారు.ఎన్.సి దాస్,కామినేని పట్టాభిరామయ్య, డాక్టర్ సమరం, డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు దంపతులు, పాలడుగు లక్ష్మణరావు, జి.నారాయణ రావు, డాక్టర్ జంధ్యాల శంకర్, వక్కలగడ్డ భాస్కర్ రావు, మన్మోహన్ సింగ్, కోనేరు శ్రీధర్, దిండకుర్తి మహేష్, పేడేటి పుల్లయ్య, సుంకర రాజేంద్రప్రసాద్, బి.వెంకట్రావు, మోతుకూరి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అంతకుముందు పున్నమి ఘాట్‌కు చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఇతర ప్రజాప్రతినిధులకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పున్నమి ఘాట్‌లో నెలకొల్పిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'విజయవాడ ఉత్సవ్' ప్రారంభోత్సవ వేడుకలను పురస్కరించుకుని పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ప్రముఖులు, భారీగా హాజరైన జనం ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. ఈకార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, కొలికపూడి శ్రీనివాస్, కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము, ఏపీ,తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ కన్వీనర్ ముత్తవరపు మురళీ కృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, తదితరులు పాల్గొన్నారు.







## అంతర్జాతీయ ప్రమాణాలతో

# వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ

## అమరావతిలో 24 నెలల్లో సిద్ధం

- కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా గ్రంథాలయాలు
- తుది దశలో మంగళగిరి మోడల్ లైబ్రరీ
- 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మోడల్ లైబ్రరీలు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో రూ.150 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపడుతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో లైబ్రరీల అభివృద్ధి, సెస్సు బకాయిలకు సంబంధించి ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, గణబాబు సోమవారం శాసనసభలో అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని 24నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో లైబ్రరీలకు సంబంధించి మౌలిక వసతులతోపాటు మ్యానుస్క్రిప్ట్‌లు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి శోభా డెవలపర్స్ అనే సంస్థ రూ.100 కోట్ల విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దాతల సహకారాన్ని కూడా తీసుకుని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. విశాఖపట్నంలో రూ.20 కోట్లతో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. పిల్లల్లో పఠనాసక్తి పెంచే అంశాన్ని సీరియస్‌గా తీసుకొని రాబోయే ఆరునెలల్లో మార్పులు తెచ్చేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నాం. గ్రంథాలయాల్లో కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఇందుకోసం కార్పొరేస్టులతో కూడా చర్యలు జరిపాం. మంగళగిరి నియోజకవర్గంలో మోడల్ లైబ్రరీ నిర్మాణం చివరిదశలో ఉంది, ఈ లైబ్రరీని అక్టోబర్ నెలలో ప్రారంభిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల నిర్మాణాలను చేపడతాం. ప్రస్తుతం 13 మాత్రమే జిల్లా గ్రంథాలయాలు ఉన్నాయి, కొత్త జిల్లాల ప్రాతిపదికన 26 జిల్లా గ్రంథాలయాలను ఏర్పాటుచేస్తాం. ఇందుకు సంబంధించిన ఫైలు ఆర్థికశాఖలో ఉంది. గ్రంథాలయ సెస్సు బకాయిలకు సంబంధించి 2022-23లో 40శాతం, 2023-24లో 45శాతం, ప్రస్తుతం సంవత్సరం 52శాతం మాత్రమే వసూలయ్యాయి. పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖల మంత్రులను సంప్రదించి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రంథాలయాల్లో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన అన్నిరకాల పుస్తకాలను అందుబాటులోకి తెస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు డిజిటల్ లైబ్రరీలపై దృష్టి సారించాం. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను వందరోజుల్లో ఆవిష్కరిస్తాం. సభ్యుల సూచనలతో దేశానికే మోడల్ గా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

---

### దసరా నుంచి దీపావళి వరకు

## జీఎస్టీ సంస్కరణలపై విస్తృత ప్రచారం

- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు
- మంత్రి లోకేష్ ఛాంబర్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం
- కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చ



అమరావతి (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు ప్రతిఒక్కరికి అందేలా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కూటమి ప్రభుత్వం విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన జీఎస్టీ సంస్కరణలపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సమావేశమయింది. జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, అధికారులు విస్తృతంగా చర్చించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సీఎం చంద్రబాబుకి నివేదించనున్నారు. దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ సంస్కరణలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఆదేశించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు, వ్యాపారులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ఇందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల ఎదుట నో అడ్మిషన్ బోర్డులు

### అదే తన లక్ష్యమని మంత్రి లోకేష్ ఉద్ఘాటన

- గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 117తో 10లక్షల మంది పేద విద్యార్థులు చదువుకు దూరం
- ప్రత్యామ్నాయంగా వన్ క్లాస్ - వన్ టీచర్ విధానాన్ని తీసుకువచ్చాం
- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల వెలుపల నో అడ్మిషన్స్ బోర్డు పెట్టాలన్నదే నా లక్ష్యం.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వంద పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు పెట్టారు.. రాష్ట్రంలోని 42వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే విధమైన పరిస్థితి తీసుకువచ్చేలా పని చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 117పై నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు శాసనసభలో సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... ప్రాథమిక విద్యకు గొడ్డలిపోటులా పరిణమించిన జీఓ నెం.117, జీఓ నెం. 85లను 13-5-2025న రద్దుచేశామని తెలిపారు. వాటి స్థానంలో వన్ క్లాస్ - వన్ టీచర్ ఉండేలా జీఓ నెం.19,20,21ల ద్వారా చర్యలు తీసుకున్నాం.

గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.117 కారణంగా 10లక్షలమంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో రాష్ట్రం వెనుకబడింది. ప్రాథమిక విద్యకు తీవ్రనష్టం కలిగించే 117 జీఓ రద్దుచేయాలని పాదయాత్రలో పలువురు ఉపాధ్యాయులు నన్ను కోరారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారులతో 33 సమావేశాలు ఏర్పాటుచేసి, జీఓ నెం. 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయ జీఓలు తెచ్చాం. అందుకు ప్రత్యామ్నాయంగా వన్ క్లాస్- వన్ టీచర్ మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకముందు కేవలం 1398 స్కూళ్లలో మాత్రమే వన్ క్లాస్ -వన్ టీచర్ ఉండగా, మేం వచ్చాక 9620 పాఠశాలలకు పెంచాం. అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు సంబంధించి గతంలో కేవలం 124 మాత్రమే ఉండగా, ప్రజాప్రభుత్వం వచ్చాక 729 పాఠశాలలను అప్ గ్రేడ్ చేశామని మంత్రి లోకేష్ తెలిపారు.

**దేశానికే ఆదర్శంగా..**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను దేశానికే మోడల్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మన బడి - మన భవిష్యత్తు కింద ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసి దాతల ద్వారా పారదర్శక విధానంలో ఎస్ఎంసిల పర్యవేక్షణతో వివిధ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. దాతలు అందజేసే నిధులను బట్టి ఆయా పాఠశాలలకు వారి పేర్లు పెట్టే ప్రతిపాదన కూడా ఉంది. పాఠశాలలకు ఇప్పటికే స్టార్ రేటింగ్ ఏర్పాటుచేశాం. వన్ స్టార్, 2స్టార్ పాఠశాలలను మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత శాసనసభ్యులపై ఉంది. మౌలిక సదుపాయాలతోపాటు అటెండెన్స్, ఎగ్జామ్స్, పెర్ఫార్మెన్స్, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై కూడా శ్రద్ధ పెడుతున్నాం. రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలల కన్నా మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, మంచి ఫలితాలు తీసుకురావడానికి కృషిచేస్తున్నాం. విద్యార్థులు చదివే ప్రాథమిక పాఠశాలలు కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉంటే రవాణా ఖర్చు కింద నెలకు రూ.600 చొప్పున 10నెలల పాటు తల్లిదండ్రుల అకౌంట్ లో జమచేస్తాం. ఈ ఏడాది దాదాపు 70వేల మంది విద్యార్థులకు ఈ రవాణా చార్జీలను అందజేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

---

## మీ నాయకత్వంలో సరికొత్త ఎత్తులకు క్రికెట్

### - ఐసీసీ చైర్మన్ జై షాకు మంత్రి లోకేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): ఐసీసీ చైర్మన్ జై షాకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఐసీసీ చైర్మన్, నా సోదరుడు జై షా కు పుట్టినరోజు శుభాకాంక్షలు. దృఢమైన నాయకత్వంతో క్రికెట్‌లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. మహిళలకు వేతన సమానత్వం, డబ్ల్యూపీఎల్ ప్రారంభం, మంచి వేతనాలు, పెన్షన్లు ఇందుకు నిదర్శనం. రికార్డు స్థాయి మీడియా హక్కులతో క్రికెట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. క్రికెట్‌కు, భారతదేశానికి మీరు ఇంకా చాలా సంవత్సరాలు సేవ చేయాలని కోరుకుంటున్నాను. జై షా తన దార్శనికతతో క్రికెట్‌లో ప్రతి ఫార్మాట్‌ను, ఆటగాళ్లను, అభిమానులను సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.



## డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల వేడుకలకు హాజరుకండి

**- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి లోకేష్ ఆహ్వానం**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ నెల 25న మెగా డీఎస్సీ విజేతలకు నియామక ఉత్తర్వులు అందించే కార్యక్రమానికి హాజరు కావాలని పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. గత అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకపోగా, మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు దాదాపు 106 కేసులు వేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట నిలుపుకుందని తెలిపారు. దీనివల్ల ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ టీచర్ల కలలు సాకారం అయ్యాయని మంత్రి లోకేష్ చెప్పారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో

# పొలం వదిలి... కలం పట్టిన చిన్నారి




- **చిట్టితల్లి జెస్సీ చిలకలడోన కేజీబీవీలో చేరిందోచ్!**
- **హామీ ఇచ్చిన 24 గంటల్లో జెస్సీ చదువు కల సాకారం**
- **మాట నెరవేర్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

*మొన్నటి వరకు పత్తి చేలో కూలీ ఆ పాలబుగ్గల చిన్నారి..*

*నిన్న తనకు చదువుకోవాలని ఉంది అని చెప్పింది..*

*విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ "చిట్టి తల్లీ.. నిశ్చింతగా చదువుకో" అని భరోసా ఇచ్చారు.*

*24 గంటల్లో చిన్నారి జెస్సీ పొలం వదిలి.. కలం పట్టింది.*

*చిట్టి తల్లి జెస్సీ చిలకలడోన కేజీబీవీలో చేరిపోయింది..*

*ఇది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతోనే సాధ్యమైంది.*

*పిల్లలు అంటే నారా లోకేష్‌కి పంచప్రాణాలు..*

*వారు చదువుకి దూరమైతే తట్టుకోలేరు..*

*చిన్నారుల స్వచ్ఛమైన చిరునవ్వులు వరం అంటారు.*

*ఎక్కడికెళ్లినా, ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా పిల్లలు కనిపిస్తే, వారిని ఎత్తుకుని, లాలించి, నవ్వించి వారి ఆనందంలో తన ఆనందం చూసుకుంటారు.*

*ఆయన వెంట చిన్నారుల కోసం చాక్లెట్ల బ్యాగు నడిచి వస్తుంది.*

పాదయాత్రలో ఒక పిల్లాడు పార్టీ జెండా పట్టుకుని కనిపిస్తే.. ఆ జెండా తీసుకొని.. నువ్వు ఉండాల్సింది బడిలో.. అంటూ పంపించిన ఆదర్శమూర్తి యువనేత నారా లోకేష్..ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యంతో విద్యాలయాలను రాజకీయాలకు దూరంగా ఉంచిన విద్యాశాఖ మంత్రి.. బడిలో ఉండాల్సిన బాలిక పత్తి చేలో కూలి పనులు చేస్తుంటే తట్టుకోగలరా? నాకు చదువుకోవాలని ఉంది సార్ అని చిట్టితల్లి అడిగితే.. విద్యా మంత్రి క్షణమైనా ఆగుతారా?

మంత్రాలయం మండలం బూదూరు గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబమైన మీనిగ కుమార్, సంతోషమ్మలకు ముగ్గురు సంతానం. పెద్ద కొడుకు ప్రభాస్ ఏడో తరగతి నందవరం ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్నాడు. మూడో కుమార్తె మను గ్రామంలోనే ప్రభుత్వం పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెండో కుమార్తె జెస్సీ ఊర్లో ఐదవ తరగతి పూర్తి చేసింది. సమీప కేజీబీవీలో సీట్లు నిండిపోయాయి. దీంతో తల్లిదండ్రులు తమతో పాటు జెస్సీని తెలంగాణ రాష్ట్రంలో పత్తి పనులకు తీసుకెళ్లారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జెస్సీ తనకు సీటు వస్తే చదువుకోవాలని ఉంది అని మీడియా ప్రతినిధితో చెప్పింది. ఆ కథనం చూసి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చలించి పోయారు. "చిట్టితల్లి నిశ్చింతగా చదువుకో" అని భరోసా ఇచ్చారు. హామీ ఇచ్చిన 24 గంటల్లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, కేజీబీవీ అధికారులు, డీఈఓ శామ్యూల్ పాల్, ఎంఈవో 2 రాగన్న.. జెస్సీని చిలకల డోన కేజీబీవీ ఆరో తరగతిలో చేర్పించారు. పత్తి చేలో నుంచి పాఠాలు చెప్పే బడిలో చేరిన జెస్సీ ఆనందానికి అవధులు లేవు. మంత్రి నారా లోకేష్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బడి బయట బాలిక బడిలో చేరిన సందర్భంగా విద్యాశాఖ అధికారులు, టీచర్లు చిన్నారి జెస్సీకి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి కస్తూర్బా గాంధీ విద్యాలయంలోకి స్వాగతించారు.





# ఐదేళ్లూ రైతులను దగా చేశారు

- రబీ పంటలకు పైసా కూడా బీమా లేదు
- ఇప్పుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారా
- కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు న్యాయం
- అసెంబ్లీలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వ్యవసాయంపై చర్చలో సభ్యుల ప్రశ్నకు సమాధానం



అమరావతి(చైతన్యరథం): జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతుల ను పట్టించుకోలేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో రబీ పంటకు పైసా కూడా బీమా ఇవ్వలేదని విమర్శించారు. అసెంబ్లీలో వ్యవసాయ రంగంపై జరిగిన చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఏపీలో ఎరువులు, యూరియా సమస్యలను అధిగమించామని తెలిపారు. యూరి యాపై రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పుకొ చ్చారు. 7.86 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటికే 6.90 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని స్పష్టం చేశారు. ఇంకా 97 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని వెల్లడిం చారు. రైతు సేవా కేంద్రాల్లో 70 శాతం యూరియా పంపిణీ చేస్తున్నామని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రబీ పంటకు పైసా కూడా బీమా ఇవ్వని జగన్ మళ్లీ ఇప్పుడు సిగ్గు లేకుండా రైతుల గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగంలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. డ్రిప్, స్ప్రింక్లర్లు కావాలని కోరిన వారికి 24 గంట ల్లోగా ఇస్తున్నామని తెలిపారు. అన్నదాతలు అనేక ప్రాంతాల్లో నానో యూరియా వాడి అధిక దిగుబడులు తెస్తున్నారని చెప్పుకొ చ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయశాఖకు కేంద్ర ప్రభు త్వం ఇచ్చిన నిధులను రూపాయి కూడా వాడలేదని మండిపడ్డారు.

### భూసార పరీక్షలు, ఇన్‌పుట్ సబ్సిడీ

టీడీపీ హయాంలో 2015-16 నుంచి 2018-19 వరకు రైతులకు 134 లక్షల సాయిల్ హెల్త్ కార్డ్స్ పంపిణీ చేశాం. వైసీపీ హయాంలో 2019-20 నుంచి 2023-24 వరకు కేవలం 4.98 లక్షలు మాత్రమే పంపిణీ చేశారు. ఇప్పుడు ప్రభుత్వంలో భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యతనిస్తూ 2024-25 నుంచి 2025-26 వరకు మొత్తం 10-35 లక్షల నమూనాలు సేకరించి 6,51,841 పరీక్ష పత్రాలు జారీ చేశాం. అన్నదాత సుఖీభవతో ఆదుకున్నాం. 2023 ఏప్రిల్, మే నెలల్లో వైసీపీ హయాంలో అధిక వర్షాల వలన జరిగిన నష్టానికి మొక్కజొన్న, జొన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు రూ.5 కోట్లను విడుదల చేయలేదు. వ్యవసాయ శాఖలో ఇన్ పుట్ సబ్సిడీ నష్టపరిహారాన్ని వరి పంటకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు పెంచాం. జూన్ 2024 నుంచి 2025 నేటి వరకు పంట నష్ట పోయిన 2 లక్షల మంది రైతులకు 310 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న 81 రైతుల యొక్క కుటుంబాల కు ఎగవేసిన 5.67 కోట్ల నష్టపరిహారాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. 2025-26 సంవత్సరానికి 22 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాం. ఆత్మహత్యలు చేసుకున్న 150 రైతుల కుటుం బాలకు 10.50 కోట్లు చెల్లించేందుకు బిల్లులు సబ్మిట్ చేశాం. ఈ 150 మందిలో 82 మంది వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మ హత్యలు చేసుకుని నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నవారే. గత ప్రభుత్వంలో వ్యవసాయ పనిముట్లను ట్రాక్టర్లను సరఫరా చేయలేదు. తమ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.

### పంటలకు మద్దతు ధర అమలు

కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న వ్యవసాయ పంటలకు వెంటనే మార్కెట్ జోక్యాన్ని అందించడానికి 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.300 కోట్లు బడ్జెట్‌లో మంజూరు చేసింది. అయినప్పటికీ అవసరాన్ని బట్టి రైతుల శ్రేయ స్సు దృష్ట్యా ఈ బడ్జెట్‌ను ఇంకా పెంచుకుంటూ పోతాం. ఇప్పటికే సుమారుగా 800 కోట్ల వరకు మద్దతు ధరల కోసం ఖర్చు పెట్టాం. పొగాకు 271 కోట్లు, మామిడి 261 కోట్లు, ఉల్లి 125 కోట్లు, కోకో 14 కోట్లు, టమాటో 12 కోట్లు ఖర్చు చేశాం.

### మిర్చి రైతులను ఆదుకున్నాం

ధరలు పతనమైన సందర్భంలో మిర్చీ రైతులను ఆదుకోవ డానికి చంద్రబాబు చేసిన అవిరాళ కృషి ఫలించింది. మిర్చీ పంటకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ఒక క్వింటాకు రూ.11,781.25గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ ధర పతనమైన సందర్భంలో ఆ వ్యత్యాస దనాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. 2020లో మిర్చికి మార్కెట్ రేటు రూ.12 వేలు ఉన్నప్పటికీ మద్దతు ధరగా కేవలం రూ.7 వేలు మాత్రమే వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అమలు చేయడానికి ఎటువంటి నిధులు కూడా మంజూరు చేయలేదు.

### ఉల్లి రైతులకు న్యాయం

2025-2026 సంవత్సరంలో ప్రస్తుతం కర్నూలు ఉల్లి ధరలు తగ్గినందున సీఎం ఆదేశాల మేరకు క్వింటాకు రూ.1200 చొప్పు న మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్‌లో కొనుగోలు ప్రారంభించి రైతు బజార్లకు సరఫరా చేశాం. సెప్టెంబరు 6 నుంచి ధర వ్యత్యాస పథకం అమలును ప్రారంభించాం.క్వింటాకు రూ. 1200/- కన్నా తక్కువకు మార్కెట్‌లో ఉల్లి అమ్ముడు పోతే, ఆ వ్యత్యాస ధరను ప్రభుత్వమే రైతుకు నేరుగా అందిస్తుంది. ఇప్పటి వరకు మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వమే 10,747 క్వింటాళ్లుకొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా సరఫరా చేసింది. వ్యాపారుల ద్వారా నేరుగా కొనుగోలు చేసింది 15,292 క్వింటాళ్లు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. 53,239 క్వింటాళ్లు. ధర వ్యత్యాస పథకం కింద ఏపీ మార్క్‌ఫెడ్ 51,268 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. మొత్తం 1,20,754 క్వింటాళ్ల నేటివరకు కొనుగోలు చేశాం. తక్షణం రైతులకు చెల్లింపుల కొరకు 10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఉల్లి రైతు లు ఇబ్బందులు పడినప్పుడు కేంద్ర ప్రభుత్వం హెక్టారుకు 17,500 అందిస్తే దానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 7,500 కలిపి మొత్తం రూ.25 వేలు ఇచ్చే వాళ్లం. ఈసారి ఉల్లి రైతుల కష్టాలను అర్థం చేసుకుని ఇప్పటివరకు ఇచ్చే రూ.25 వేలను 100 శాతం పెంచి మరో రూ.25 వేలు అదనంగా కలిపి మొత్తం రూ.50 వేలు రెట్టింపు సాయాన్ని రైతన్నలకు అందిస్తాం. దీనికి రూ.125 కోట్లు అవసరమవ్వగా వెంటనే విడుదల చేసి ఉల్లి రైతులను ఆదుకుంటామని తెలిపారు. బర్లీ పొగాకు, మామిడి, టమాటా రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకున్నాం. సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. మైక్రో ఇరిగేషన్, ఉద్యాన పంటల సాగుకు చేయూత నిస్తున్నాం. 2024-25, 2025 నుంచి నేటికి ప్రకృతి వైపరీత్యాల వల్లపంటలు కోల్పోయిన వారికి రూ.50 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం జరిగింది. అమెరికా టారీఫ్‌ల వల్ల ఒడిదుడుకులకు గురైన ఆక్వా రంగాన్ని ఆదుకోవటానికి తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. సాను కూలంగా చర్యలు తీసుకోవాలని కోరగా స్పందించినట్లు చెప్పారు.

# పట్టా భూమి మరొకరికి ఆన్‌లైన్

- వైసీపీ నాయకుల అండతో బెదిరించారు
- ఒకే సర్వే నెంబరులో భూమి ఇద్దరికి
- లంచం తీసుకుని వీఆర్వో నిర్వాకం
- ప్రజా వినతులకు భూ సమస్యలు

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ వారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఏపీ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ అర్జీలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా ధర్మవ రానికి చెందిన కె.పద్మావతి సమస్యను వివరిస్తూ తన మామకు ఆరుగురు అన్నదమ్ములు కాగా వారిలో మొదటి, రెండో వారికి సర్వే నెంబరు 297-6లో 5.41 సెంట్లు భూమి ఉంది. మిగి లిన నలుగురికి సర్వే నెం.402లో 1.33 సెంట్లు భూమి ఉంది. ఒక్కొక్కరికి 2.58 సెంట్లు. ఇది పట్టా భూమి కాగా 1980లో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ అగ్రిమెంట్‌లో ఆరుగురి పేర్లు ఉన్నా యి. 1980 నుంచి సాగులో ఉన్నారు. వారి ముగ్గురు 1999లో భూమిని అమ్మేశారు. కానీ అప్పుడు మొదటి, రెండో వ్యక్తి ఎటు వంటి అభ్యంతరం చెప్పలేదు. ఆరుగురిలో ఐదుగురు మరణిం చారు. కానీ మొదటి వ్యక్తి, రెండో వ్యక్తి కుమారులు సర్వే నెం. 402లో భూమి ఉందని 2023 సెప్టెంబరులో కొంత మంది వైసీపీ నాయకులతో కలసి మొదటి వ్యక్తి భార్య, రెండో వ్యక్తి భార్య పేరుపై 1బీలో ఎక్కించి తమపై దౌర్జన్యానికి దిగి చంపే స్తామని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### ఒకే సర్వే నెంబరులో భూమి ఇద్దరికి ఎక్కించారు

తన మామ బద్దె నాయక్ పేరున ఖాతా నంబరు 928 సర్వే నంబరు 631లో 4.12 ఎకరాలు ప్రభుత్వం మంజూరు చేసిందని వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లె మండలం నెలవరం తండా గ్రామానికి చెందిన సభావాత్ వాకమ్మ తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి తహ సీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక వీఆర్వో రవిరెడ్డి లంచాలు తీసుకుని కంచెర్ల మనోహర్, అను కుల నాగులమ్మ పేర్లతో ఒకే సర్వే నెంబరును డుప్లికేట్‌గా ఆన్‌లైన్ లో ఎక్కించారు. ఒకే సర్వే నెంబరు ఇద్దరికీ ఎలా వస్తుందని ప్రశ్నిస్తే తహసీల్దారు తాత్కాలికంగా ఎక్కించామని చెప్పారు. తమ మామ బద్దె నాయక్ గుడిసె





కాలిపోయినప్పుడు అందులో ఉన్న అసలు డీ-ఫారం పత్రాలు కూడా దగ్ధం అయ్యాయి. ఆ విషయం తెలిసి వారు మాకు తెలియకుండా నకిలీ ఎంట్రీలు చేశారు. తమ పత్రాలను ఉపయోగించి వీఆర్వో రవిరెడ్డి కంచెర్ల మనోహర్‌కి జిరాక్స్ ఇచ్చాడు. ఒరిజినల్ ఢీపారం వీఆర్వో రవి రెడ్డి దగ్గర ఉంది. దాని కోసం మండల రెవెన్యూ కార్యాల యానికి వెళ్తే తమని సంతకాలు చేయమని బెదిరిస్తున్నాడు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

### భూ సమస్యను పరిష్కరించాలి


పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన రావెళ్ల కరుణాకుమారి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నంబర్ 184-ఏలో గల మాగాణి ఎకరం పొలం తన అమ్మమ్మ బాల్లెపల్లి లక్ష్మమ్మ, బాల్లెపల్లి పెద పిచ్చయ్య వీలునామా ద్వారా తన తల్లి రావెళ్ళ సూర్యాంబ, చంద్రకమలాంబ (పిన్ని)ల కు 1985లో సంక్రమించింది. 1990లో అమ్మమ్మ మరణించగా అప్పటి నుంచి ఆ భూమిని కౌలుకు ఇచ్చి ప్రతిఫలం పొందుతూ వచ్చాం. 2013లో తమ తల్లి సూర్యాంబ మరణించాక మేనమామ బాల్లెపల్లి హనుమంతరావు కౌలుదారుల వద్ద నుంచి డబ్బులు తీసుకుని తనకు అందజేస్తున్నారు. ఆయన 2020లో మరణించిన తరువాత కూడా గతంలో ఉన్న కౌలుదారులకే భూమిని ఇచ్చి ప్రతిఫలం పొందుతూ వస్తున్నాను. బొల్లెపల్లి ఆరుబాబు, బొల్లెపల్లి అప్పారావు కుటుంబ సభ్యులు వారి ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆ పొలం తమదేనంటూ కౌలు ఇవ్వొద్దని కౌలుదారులను బెదిరిస్తున్నారు. ఈ భూమి తమ కుటుంబానికి 35 సంవత్సరాలుగా అనుభవంలో ఉంది. ఇది తమ హక్కు అయినప్పటికీ మమ్మల్ని బెదిరించి జీవనాధారాన్ని కాజేయాల నుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### తమ స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెద్దపరిమి గ్రామానికి చెందిన వెంకటరావమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 375లో 210 గజాల్లో డాబా, రేకులతో ఇల్లు కలిగి ఉన్నాను. తమ స్థలానికి తూర్పు హద్దున ఘట్టమనేని కృష్ణ అనే వ్యక్తి ఉన్నారు. వారు తమ స్థలంలోకి వచ్చి చెట్లు నాటారు. తమను రానివ్వకుండా గొడవ చేస్తున్నారు. దీనిపై తుళ్లూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ స్థలం తమకు ఇప్పించాలని అభ్యర్థించారు.

# స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

**- విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానం**



విజయవాడ(చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్ ద్వారా ఏపీ సాంస్కృతిక వైభవం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న ఈ మహోత్సవం ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ కార్నివాల్‌గా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్పీకర్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు బోండా ఉమా, గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్ సోమవారం స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు పున్నమి ఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఎంజీ రోడ్, ఘంటసాల సంగీత కళాశాల, విజయవాడ ఎక్స్పో వేదికలపై జరిగే ఈ ఉత్సవం విజయవాడ సాంస్కృతిక గౌరవాన్ని మరింతగా పెంచుతుందని తెలిపారు. అమ్మవారి దసరా శోభాయాత్రల నడుమ జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా "ఒక్క నగరం- ఒకే ఉత్సవం" అనే భావనతో నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ ఉత్సవంలో రాష్ట్ర ప్రజలందరూ పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. దేవి కనకదుర్గ అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

# దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి



విజయవాడ (చైతన్యరథం): బాలాత్రిపుర సుందరీదేవి అలంకా రంలో ఉన్న దుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత సోమ వారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్యూ లైన్‌లో భక్తుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుర్గ మ్మను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. దుర్గమ్మ దయ అం దరిపై ఉండాలి. ఉత్సవాల ఏర్పాట్లు చాలా బాగున్నాయి. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉన్నాయి. పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు శక్తి, మంచి ఆరోగ్యం ఇవ్వాలని, ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్ల పాటు ఉండాలని దుర్గమ్మను కోరుకున్నట్లు తెలిపారు.

# చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్

- **ఆప్కో పండుగ ఆఫర్ల ప్రకటన**
- **దసరా, దీపావళి నేపథ్యంలో అమలు**
- **నేతన్నలకు, వినియోగదారులకు మేలు**
- **చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): దసరా, దీపావళి నేపథ్యంలో ఆప్కో భారీ డిస్కౌంట్ ప్రకటించింది. పండగలను తెలుగుదనం ఉట్టిప డేలా జరుపుకోవడానికి చేనేత వస్త్రాల కొనుగోలుపై 40 శాతం డిస్కౌంట్ అందజేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.

ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకా లను అమలు చేస్తూనే మరో వైపు చేనేత వస్త్రాల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రాష్ట్ర, జాతీయ స్థాయిలో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహిస్తోంది. అదే సమయంలో చేనేత దుస్తుల వినియోగంలో పెరిగేలా భారీ డిస్కౌంట్లు అందజేయడంతో పాటు ఈ కామర్స్‌లో అమ్మకాలకు పెట్టింది. నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేనేత దుస్తులను డోర్ డెలివరీ చేస్తోంది.

ఈ నేపథ్యంలో దసరా, దీపావళి పండగలను దృష్టిలో పెట్టుకుని చేనేత దుస్తుల కొనుగోలుపై 40 శాతం డిస్కౌంట్ అందజేయాలని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశాలతో ఆప్కో నిర్ణయించింది. రాష్ట్రం తో పాటు జాతీయ స్థాయిలో 92 ఆప్కో షోరూమ్‌లు ఉన్నాయి. ఈ వీటిల్లో కొనుగోలు చేసే చేనేత వస్త్రాలపై 40 శాతం మేర భారీ డిస్కౌంట్ అందజేయనున్నారు. ఇంటిల్లపాది చేనేత దుస్తులు ధరించి దసరా, దీపావళి పండగలు తెలుగింటి సంప్రదాయంలో ఘనంగా నిర్వహించుకోడానికి ఈ భారీ డిస్కౌంట్ దోహదపడడం ఖాయమని ప్రభుత్వం భావిస్తోంది.

**సంప్రదాయ రీతిలో పండగ చేసుకుందాం**

దసరా, దీపావళి పండగ నేపథ్యంలో ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాల కొనుగోలుపై 40 శాతం డిస్కౌంట్‌తో వినియోదా రులకు ఆర్థికంగా మేలు, నేతన్నలకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి సవిత తెలిపారు. దసరా, దీపావళి పండగలను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులు, చేనేతల కుటుంబాల్లో ఆనందాలు నింపడమే లక్ష్యంగా 40 శాతం డిస్కౌంట్ అందజేస్తున్నట్లు తెలి పారు. చేనేత వస్త్రాలు తెలుగింటి సంప్రదాయానికి నిలువెత్తు ప్రతిబింబమన్నారు. ఇంటిల్లపాది చేనేత దుస్తులు ధరించి నేతన్న లకు అండగా నిలుద్దామని, దసరా, దీపావళి పండగలను సంతో షంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు.

# ప్రతిష్టాత్మకంగా విజయవాడ ఉత్సవ్

**- ప్రారంభించిన మంత్రి మండిపల్లి**

**- హెలికాప్టర్ రైడ్‌లో చక్కర్లు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో దసరా పండుగ సందర్భంగా ఉత్సవ్ ఎగ్జిబిషన్, హెలికాప్టర్ రైడ్‌ను రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. అనంతరం హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినా యుడు పాల్గొన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో వినోదం, విజ్ఞానం, వాణి జ్యం సమ్మిళితంగా కుటుంబాలకు వినోదంతో పాటు విజ్ఞానం అందించే వేదికగా నిలవనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దసరా పండుగ ధర్మం..అధర్మంపై, సత్యం.. అసత్యంపై సాధించిన విజయానికి ప్రతీక. ఉత్సవ్ ఎగ్జిబిషన్ విజయవాడ ప్రజల ప్రతిభ, వ్యాపారం, సంస్కృతిని దేశానికి చూపించే వేదిక అవుతుందని పేర్కొన్నారు.

# హెచ్ఐవీ నియంత్రణలో ఏపీకి రెండో స్థానం

- **తొలి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన న్యాకో**
- **వివిధ విభాగాల్లో ఏపీ శాక్స్ ప్రగతి**
- **వైద్య మంత్రి సత్యకుమార్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): హెచ్ఐవీ నిరోధ చర్యల్లో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు రెండో ర్యాంకు లభించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) రాష్ట్ర పనితీరు మరింత మెరుగుపడింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో 11వ స్థానంలో ఉన్న ఏపీ ఈ ఈసారి ద్వితీయ స్థానానికి చేరుకోవడం విశేషం. ఈ మేరకు ఏపీ శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ విభాగాల్లో చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఈ ర్యాంకును ప్రకటించింది. నిర్దేశించిన ప్రమాణాల మేరకు న్యాకో రాష్ట్రాలకు 132 స్కోరును నిర్ణయించగా.. ఏపీ శాక్స్ 98 స్కోరును(74.2 శాతం) సాధించింది. గతేడాది ఇదే సమయం(ఏప్రిల్ -జూన్)లో 11వ స్థానంలో ఉన్న ఏపీశాక్స్ రెండవ స్థానానికి చేరుకోవడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు.

**విభాగాల వారీగా పురోగతి**

యూఎన్ హెచ్ఐవీ లక్ష్యం మేరకు ఏపీలో వ్యాధితో చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందిలో వైరల్ లోడ్ తగ్గింది. రాష్ట్రంలోని ఏఆర్టీ సెంటర్లను సమర్థవంతంగా నిర్వహించడం, పర్యవేక్షించడం వల్ల ఏపీశాక్స్ ఈ ప్రగతిని సాధించింది. ఏపీలో 2.30 లక్షల మంది ఎయిడ్స్ బాధితులు మందులు వాడుతున్నా రు. అలాగే సోషల్ మీడియాలో ప్రచారం చేసే విభాగంలో లక్ష్యా నికి మించి పోస్టులు పెట్టినందుకు గాను ఏపీశాక్స్‌కు గుర్తింపు లభించింది. ముఖ్యంగా హెచ్ఐవీ యాక్ట్-2017పై ఈ-మాడ్యుల్స్ (ఆన్‌లైన్) విధానంలో స్కూళ్లు, కాలేజీల్లో అవగాహనా కార్యక్ర మాలు నిర్వహించడం, విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఏపీశాక్స్ మంచి ఫలితాల్ని సాధించింది. హెచ్ఐవీ అనుమాని తులకు పరీక్షలు చేసేందుకు ఉద్దేశించిన టార్గెటెడ్ ఇంటర్వెన్షన్స్, లింక్ వర్కర్స్ స్కీం విభాగాల్లో నూరు శాతం ప్రగతిని సాధించింది.



కమ్యూనిటీ ఆర్గనైజేషన్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు(ఎన్జీఓలు), అవుట్ రీచ్ వర్కర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏపీశాక్స్ సమర్థ వంతంగా నిర్వహించింది.

**తల్లి నుంచి బిడ్డలకు సోకకుండా..**

రాష్ట్రవ్యాప్తంగా 26 టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సెంటర్లు, 13 లింక్ వర్కర్ స్కీం కేంద్రాలున్నాయి. టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సెంటర్లకు వెళ్లలేని ఎయిడ్స్ బాధితులు అవుట్ రీచ్ స్కీం సెంటర్ల ద్వారా సేవలన్ని పొందొచ్చు. సిఫిలిస్ పాజిటివ్ వచ్చిన గర్భిణిలకు 100 శాతం మేర చికిత్స అందించి ఏపీశాక్స్ మరో గుర్తింపును పొం దింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీల ద్వారా దీన్ని సాధించింది. తల్లి నుంచి బిడ్డకు సిఫిలిస్ రాకుండా నివారించ డంలో 100 శాతం మేర ఫలితాన్ని సాధించింది. అలాగే శిశువులకు నిర్ధారణ పరీక్షలు చేయడంలో కూడా 95 శాతం మేర లక్ష్యాన్ని సాధించింది. హెచ్ఐవీ కవరేజీ విభాగంలో న్యాకో నిబం ధనల మేరకు ప్రతి ఏడాది హైరిస్క్ గ్రూపులను చేరుకోవడంలో జాతీయ స్థాయిలో లక్ష్యం 90 శాతం ఉండగా, ఏపీ 124 శాతాన్ని సాధించింది. హెచ్ఐవీ హాట్ స్పాట్లను గుర్తించి మ్యాపింగ్ చేసి, తదనుగుణంగా చర్యలు చేపట్టడంతో ఎయిడ్స్ వ్యాప్తిని గణనీ యంగా తగ్గించగలిగింది. ఎయిడ్స్ బారిన పడిన కొత్త వ్యక్తుల ను గుర్తించడం ద్వారా ఇది సాధ్యపడిందని ఏపీ శాక్స్ అధికా రులు తెలిపారు. న్యాకో మంజూరు చేసిన నిధులను 99 శాతం మేర ఖర్చు చేయడంతో పాటు, నిర్దేశిత కాలంలోగా న్యాకోకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను అందజేయడంలో ఏపీ శాక్స్ ముందుంది.

# విజయవాడ ఉత్సవ్‌తో వైభవం చాటాలి

- నగర ప్రాధాన్యం మరింత పెరిగింది
- సాంస్కృతిక, చారిత్రక వారసత్వ ప్రాంతమిది
- భవిష్యత్తు తరాలకు గొప్పదనాన్ని తెలియజేయాలి
- తెలుగు వ్యాప్తికి ఈ కార్యక్రమం వేదిక కావాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రుల రాజధాని అమరావతి వైభవం ప్రపంచానికి తెలియాలి. ప్రపంచ పటంలో విజయవాడ, గుంటూరులతో కలిసిన అమరావతి నూతన వైభవం సంతరించు కోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. "ఒకే నగరం - ఒకటే సంబరం" అనే నినాదంతో నిర్వ హిస్తున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొని ప్రసంగించారు. పౌరాణికంగా, చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన విజయవాడ తరతరాలుగా తెలుగు వారి భాష, సంస్కృతు ల రాజధానిగా ప్రత్యేకించి దక్షిణాదిన వాణిజ్య రాజధానిగా విరాజి ల్లింది..విరాజిల్లుతోంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరా వతి రూపంలో విజయవాడ ప్రాధాన్యత మరింత పెరిగింది అని చెప్పారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు అమరావతితో పాటు విజయవాడ, గుంటూరు నగరాలు అభివృద్ధి చెంది ఓ విశాల రాజధాని ఏర్పాటు దిశగా చొరవ తీసుకున్నానని గుర్తు చేశారు. అందులో భాగంగానే.. స్మార్ట్ సిటీలు, అమృత్ నగరాల్లో అమరా వతికి చోటు కల్పించామని, ఇది విజయవాడ అభివృద్ధికి ఉపక రించే అంశమని, అమృత్ నగరాల్లో విజయవాడ అభివృద్ధి చెందిం దని చెప్పారు. కొండపావులూరులో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, సూరంపల్లిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జాతీయ సంస్థ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ప్రత్యేక దూరదర్శన్ కేంద్రం, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసు, విజయవాడ విమానాశ్రయాన్ని అంతర్జాతీయంగా తీర్చిదిద్దడంతో పాటు టెర్మినల్ సామర్థ్యం పెంపు, ముక్త్యాల నుంచి విజయవాడ వరకూ బకింగ్ హాం కెనాల్ అభివృద్ధి, గుంటూరులో వ్యవసాయ విశ్వవిద్యాల యం, మంగళగిరిలో ఎయిమ్స్... ఇవన్నీ విజయవాడ- అమరా వతి-గుంటూరు అభివృద్ధిని దృష్టిలో



పెట్టుకుని తీసుకున్న చొరవ లేనని చెప్పారు.

**చరిత్రకు సజీవ సాక్ష్యాలు**

విజయవాడ ఘన చరిత్రను గుర్తు చేస్తూ కళ, సాహిత్య, భాషా రంగాల్లో విశేషమైన చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన విజయవాడ తెలుగు వారి గొప్ప వారసత్వాన్ని కళ్లకు కడుతుంది. అనేక పత్రికలు విజయవాడ నుంచి ప్రారంభమై తెలుగు వారి వాడిని, వేడిని రుచి చూపించాయి. ఇక్కడ ప్రచురణ కేంద్రాలు పుస్తక రాజధానిగా విజయవాడను మార్చాయి. ఆంధ్రప్రభ దినపత్రిక ఇక్కడ నుంచే పునఃప్రారంభమైంది. ఆంధ్రజ్యోతి దినపత్రిక కూడా ఇక్కడే ప్రారంభమైంది. తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, టీవీ చలపతిరావు, విశ్వనాథ సత్యనారాయణ వంటి ఎందరో మహనీయులు ఈ నేలను పునీతం చేశారు. తెలుగు వారి కీర్తి పతాకాన్ని ప్రపంచ యవనికపై రెపరెపలాడించిన ఎన్టీఆర్ కూడా విజయవాడలో చదువుకున్నారు. ఇక్కడి రామ్మోహన గ్రంథాల యం, హనుమంతరాయ గ్రంథాలయం తెలుగు నాట జరిగిన స్వాతంత్ర్య ఉద్యమానికి సాక్ష్యాలుగా నిలిచాయి. చారిత్రకంగానూ యుద్ధమల్లుని శాసనం, కొండవీడులోని మరోశాసనం ఈ నగరా న్ని బెజవాడగా పేర్కొన్నాయి. విష్ణుకుండినుల రాజధానిగా విలసిల్లిన ఈ నగరంలో మొగ్రాజపురం గుహలయాలు 3, 4 శతాబ్దాల నాటి చరిత్రను కళ్లకు కడుతాయి. చైనా యాత్రికుడు హుయాన్ త్సాంగ్ కూడా బెజవాడను సందర్శించి శాతవాహనుల చరిత్రను రాసినట్లు ఆధారాలు తెలియజేస్తున్నాయి. స్వరాజ్య ఉద్యమ కాలంలో మహాత్మాగాంధీ 1919-1946 మధ్య అనేక పర్యాయాలు సందర్శించారు. ఇక్కడి గాంధీ కొండ ఆయన జీవి తంలోని అనేక అంశాలను మనకు తెలియజేస్తుందని చెప్పారు. విజయవాడకు తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం మరో గుర్తింపు అన్నారు. ఈ కళా క్షేత్రం దశాబ్దాలుగా ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేలాది కళాకారుల ప్రదర్శనలకు, కార్యక్ర మాలకు చక్కని వేదిక అయ్యిందని, 2015లో తాను కేంద్ర మంత్రి గా ఉన్న సమయంలో ఈ కళాక్షేత్రం చరిత్రను దృష్టిలో ఉంచుకుని ఆధునీకరణ కోసం 2 కోట్లు విడుదల చేశానని చెప్పారు.

**నగరానికి దుర్గమ్మ రక్ష**

విజయాలనందించే దుర్గమ్మగా... ముగ్గురమ్మల మూలపుటమ్మ వెలసిన కనకదుర్గ క్షేత్రం విజయవాడకు గొప్ప రక్ష అన్నారు. ప్రపంచం నలుమూ లల నుంచి లక్షలాది భక్తులు ఏటా నవరాత్రుల సమయంలో ఇక్కడి స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కోసం, ఆశీస్సుల కోసం వస్తుంటారని అన్నారు. విజయవాడ ప్రాశస్త్యాని తెలియజేసే విషయాల గురించి ఇక్కడి ప్రజలు తెలుసుకోవడమే కాకుండా ఘనమైన ఈ చరిత్ర, వారసత్వాలను భవిష్యత్ తరాలకు తెలియజేయడానికి విజయవాడ ఉత్సవ్ ఒక చక్కని వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు భాష, సంస్కృతుల పరివ్యాప్తికి ఈ కార్యక్రమాన్ని వేదికగా మలచుకోవలసిన అవసరం ఉంది. మన జీవన విధానంలో ఆయువు పట్టులాంటిది మన మాతృభాష. ఒకప్పుడు మన పద్యం, గద్యం జగద్విదితం. దానిని మరల ఇలాం టి కార్యక్రమాల ద్వారా దశదిశల వ్యాప్తి చేయాలి. మన ఆట, మన పాట, మన భాష, మన యాస, మన గోస, మన కట్టు, మన బొట్టు, చివరకు మన తిట్టు సహా సంప్రదాయాలను పునరుజ్జీ వింపచేసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. "ఒకే నగరం - ఒకటే సంబరం" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం దసరా ఉత్సవాలకు మరింత శోభను తీసుకురావడమే గాక, విజ యవాడ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేస్తుందన్నారు. ఈ సమయంలో ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు తెలుగు వారి వైభవాన్ని కళ్ళకు కట్టేలా నిర్వాహకులు చొరవ తీసుకోవాలని సూచిస్తూ మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారని వారిని అభినందించారు.

# చదువుకు దూరం కావొద్దనే సైకిళ్లు

- ఇప్పటివరకు 3 వేల మందికి పంపిణీ
- ప్రయాణంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాలి
- విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి(చైతన్యరథం): విద్యార్థులు దూరాభారంతో రవాణా సౌకర్యం లేక చదువుకు దూరం కాకూడదనే అద్దంకి నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. సహచర మంత్రి డీబీవీ స్వామితో కలిపి అద్దంకిలో పర్యటించిన గొట్టిపాటి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయడంతో పాటు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు.

ముందుగా శ్రీ ప్రకాశం, గొరకయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 400 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 10 వేల మందికి సైకిళ్లను ఉచితంగా అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సీఎస్ఆర్ నిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్నేహితులు, దాతల సహ యంతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రూ.4.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో




ఇప్పటివరకు 15 భవనాలను నిర్మించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా నెడ్ క్యాప్ సహకా రంతో సుమారు వెయ్యి కోట్ల విలువైన 2000 సైకిళ్లను విద్యార్థు లకు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు సైకిళ్లు, వికలాంగులకు ట్రై స్కూటర్ల పంపిణీతో వారంతా సంతోషంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. సైకిళ్లపై స్కూళ్లకు పంపించే విషయంలో తల్లిదం డ్రులు జాగ్రత్తలు చెప్పాలన్నారు. ప్రమాదాలు జరగకూడదని, ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదని స్పష్టం చేశారు. అనంత రం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

## ఆలూరు, రాజోలు నియోజకవర్గాలకు
# టీడీపీ ఇన్‌ఛార్జిల నియామకం

అమరావతి (చైతన్యరథం): కర్నూలు జిల్లా ఆలూరు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గాలకు టీడీపీ ఇన్‌ఛార్జిలను నియమించారు. ఆలూరుకు వైకుంఠం జ్యోతిని, రాజోలుకు గొల్లపల్లి అమూల్యని ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పల్లా తెలిపారు.

# అల్పపీడనంతో నాలుగురోజులు వర్షాలు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల నిర్వహణ ఎండీ ప్రఖర్‌జైన్**

అమరావతి (చైతన్యరథం): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నాటికి తూర్పు మధ్య, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకా శం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదు లుతూ వచ్చే శుక్రవారం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల్లో వాయు వ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది శనివారం దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వివరించారు. ఈ ప్రభావంతో మంగళ, బుధ, గురు వారాల్లో ఉత్తరాంధ్రలో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు, గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. సోమవారం సాయంత్రం 6 గంటల నాటికి అల్లూరి జిల్లా చింతపల్లిలో 84 మిమీ, అనకాపల్లి జిల్లా రాజాంలో 62.5 మిమీ, కిలగడలో 59.5 మిమీ, విజయ నగరం జిల్లా బొద్దాంలో 58.5 మిమీ, అనకాపల్లి జిల్లా చీడికా డలో 57 మిమీ వర్షపాతం నమోదైందన్నారు.

సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహం ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 3.87 లక్షల క్యూసెక్కులు ఉందని తెలిపారు.

మరోవైపు గోదావరి వరద ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద సాయంత్రం 6 గంటలకు ఇన్ ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. పెన్నానదికు కూడా వరద ప్రవాహం కొనసాగుతున్నందున ఆయా నదీ పరీవాహక ప్రాంత, లోతట్టు గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.

# యూకేలో
# శ్రీవారి కళ్యాణ మహోత్సవం



యూకే: లీడ్స్ హిందూ మందిరంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ శ్రీనివాస కల్యాణోత్సవ సమితి, లాటా, టీటీడీ, ఏపీఎన్ఆర్‌టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్లికార్జున ప్రసాద్ సమన్వ యం చేశారు. తిరుమల నుంచి వచ్చిన ప్రధాన అర్చకులు రంగనాథ్ ఆధ్వర్యంలో కళ్యాణ ఘట్టాలు శాస్త్రోక్తంగా జరిగా యి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించడంలో విజయ్ అడుసుమిల్లి, యేకాంత్, అంబి చాలికి, ఆనంద్ ముఖ్యపాత్ర వహించారు. శ్రీవారి అంకితభావం, సమ న్వయ చాతుర్యం వల్లే ఈ కార్యక్రమం యథాతథంగా సాగింది. లీడ్స్, యూకే ఇతర నగరాల నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులు, తెలుగు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా దర్శించు కున్నారు. అనంతరం టీటీడీ ప్రసాదం, అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా తెలుగు భక్తులకు, భారతీయ సంస్కృతి వెలుగు నింపే లక్ష్యంతో శ్రీనివాస కళ్యాణాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యూరప్ ఏపీఎన్ఆర్టీ సమన్వయకర్తగా పనిచేస్తున్న కిషోర్‌బాబు చలసాని, యునైటెడ్ కింగ్‌డమ్ ఏపీ ఎన్ఆర్‌టీ సమన్వయకర్త అడుసుమిల్లి విజయ్‌కుమార్, సురేష్ కోరం, యూకే యూరప్ ప్రాంతాలలో జరిగే శ్రీనివాస కల్యాణాలను విజయవంతంగా సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# కాలుష్య నియంత్రణపై నిరంతర పర్యవేక్షణ

**సిబ్బంది విధులపై సమగ్ర నివేదిక ఇవ్వాలి**
**పెట్టుబడులు ప్రోత్సహిస్తూనే నిబంధనలు**
**ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం**
**అటవీ, పర్యావరణ ముఖ్య కార్యదర్శితో సమీక్ష**



అమరావతి (చైతన్యరథం): కాలుష్య నియంత్రణపై ఎప్పటికప్పుడు దు పర్యవేక్షిస్తూ స్వచ్ఛమైన గాలి, నీరు భావితరాలకు అందించే లక్ష్యంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొ న్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో సైతం నీటిని కొనుక్కొని తాగాల్సి వస్తోంది.. అక్కడి నీరు కలుషితం కావడానికి ఆక్వా రం గం, పేపర్ మిల్లులు కారణమని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం శాసనసభ నడుస్తున్న సందర్భంలో తన ఛాంబర్‌లో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజతో సమావేశమయ్యారు. కాలుష్య నియంత్రణ మండలిపై టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేసిన ఆరోపణల నేపథ్యం లో కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, బాధ్యతలపై చర్చించా రు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి అనేది చట్ట బద్ధమైన సంస్థ.. దాని విధుల నిర్వహణలో ప్రభుత్వ పర్యవేక్షణ పాక్షికంగా ఉంటుందని అధికారులు వివరించారు. పంచాయతీ రాజ్ లాంటి శాఖలపై ప్రభుత్వం నేరుగా పర్యవేక్షించి, నియంత్రణ ఉంటుందని.. పీసీబీ నిర్ణయాలు, విధుల నిర్వహణపై పర్యవేక్ష ణలో కొన్ని పరిమితులు ఉంటాయని తెలిపారు. పీసీబీ కార్య నిర్వా హక మండలికి చట్టబద్ధంగా అధికారాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ అధికారులకు దిశానిర్దేశం చేసూ రాష్ట్రా నికి పెట్టుబడులకు ప్రోత్సహిస్తూనే కాలుష్య నియంత్రణకు సంబం ధించిన నిబంధనలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ పేరిట పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి తీసుకురాకూడదు. గత ప్రభుత్వంలో అలాంటి తప్పిదాలే చోటు చేసుకున్నాయి. ఎల్జీ పాలిమర్స్ లాంటి సంస్థల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ప్రజ లు ప్రాణాలు కోల్పోయారు. విశాఖ ప్రాంతంలో ఫార్మా సంస్థలు ఉన్నాయి. వాటిలో కాలుష్య నియంత్రణ నిబంధనలు అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. నిబంధనల అమలులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించిన తొలి రోజుల్లోనే పీసీబీపై సమీక్షించి దిశా నిర్దేశం చేశామని తెలిపారు.

**ఈ ప్రశ్నలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి**

అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి ముందు ఉప ముఖ్యమంత్రి కొన్ని ప్రశ్నలు ఉంచారు. కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది ఎంతమంది.. వారి విధులు ఏమిటి? అందులో రెగ్యులర్ ఉద్యోగులు ఎంతమంది? సిబ్బంది కొరత ఎంత? కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఏ మేరకు ఉన్నారు? వారికి అప్పగిస్తున్న విధులేమిటి? తదితర అంశాలతో పాటు విధుల నిర్వహణకు మండలికి ఉన్న మౌలిక సదుపాయాలు, వారికి ఇచ్చే ఆర్థిక వనరులు, ఆడిట్ ఏ విధంగా చేస్తున్నారు, ఆడిట్‌లో గుర్తించిన అంశాలేమిటి? కాలుష్య నియంత్రణ మండలి ఇప్పటి వరకూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై ఏ మేరకు దృష్టి సారించింది, వాటి ఫలితాలు ఏమిటి? అనుసరిస్తున్న సాంకేతికతో, కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్ పనితీరు ఎలా ఉంది? ప్రాంతాల వారీగా జల, వాయు, శబ్ద కాలుష్యాల వివరాలు అప్ డేట్ చేస్తున్నారా? ప్రజలకు ఏ మేరకు సమాచారం అందుబాటులో ఉంటోంది? వంటి పలు ప్రశ్నలు ముందు ఉంచారు. ఈ ప్రశ్న లపై సమగ్ర వివరణతో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. పీసీబీతో తొలి సమావేశంలో ఈ అంశాలు ప్రస్తావించానని, అసెం బ్లీలో ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు అక్కడే వివరాలు అందించామని ఉప ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అధికారులు సమగ్ర నివేదిక అందించాక.. అవగాహన కలిగేలా పూర్తి వివరాలు ప్రజలకు వివరిద్దామని తెలిపారు. రాష్ట్రంలో కాలుష్య, పర్యావరణ కార్యక్ర మాల్లో యువతను, విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా క్షేత్రస్థాయి వరకూ అవగాహన పెరుగుతుందన్నారు. పరిశ్రమల నిర్వాహకులను, అకడమిక్ రంగంతో అనుసంధానిస్తే కాలుష్య నియంత్రణలో ఆర్అండ్‌డీ అభివృద్ధి చెందుతుందన్నారు. పీసీబీని అడ్డంపెట్టుకుని వ్యక్తిగత ప్రయోజనాల్ని పొందాలని భావిం చే వారి విషయంలో జాగరూకతతో వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు.

# జూన్ లోపు 2,61,640 టిడ్కో ఇళ్ల పూర్తి

- **వసతులు, బకాయిలకు రూ.7280 కోట్లు అవసరం**
- **గత ప్రభుత్వం 4,39,841 ఇళ్లను రద్దు చేసేసింది**
- **ఇళ్ల నిర్మాణాల్లో అనేక అవకతవకలకు పాల్పడింది**
- **ఇవ్వకుండానే లబ్ధిదారుల పేరుపై బ్యాంకు రుణాలు**
- **అసెంబ్లీలో మంత్రి నారాయణ సమాధానం**



అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో అనేక అవకతవకలకు పాల్పడిందని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు..వచ్చే జూన్ నెలాఖరు లోపు టిడ్కో ఇళ్లను పూర్తి చేసేలా ముందుకెళుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పరిస్థితి, లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింతపై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. 2014-2019లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 ఇళ్లను కేటాయించిందన్నారు. వీటిలో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లు కూడా పిలిచి పనులు ప్రారంభించామన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ 5 లక్షల ఇళ్లను 2,61,640కు తగ్గించేసింది. అంటే మొత్తంగా 4,39,841 ఇళ్లను రద్దు చేసేసిందని తెలిపారు. ఈ ఇళ్లను కూడా పూర్తి చేయలేదని వివరించారు. అత్యాధునిక షీర్ వాల్ టెక్నాలజీతో ఇంటి సామగ్రి కూడా అత్యాధునికమైన నాణ్యమైనది వాడేలా అన్ని వసతులు, పార్కులు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు వంటివి కూడా నిర్మించేలా డిజైన్ చేశాం. కానీ గత ప్రభుత్వం వాటన్నింటినీ నాశనం చేసింది. 2019 మే నాటికి 77,350 ఇళ్లను 90 నుంచి 100 శాతం పూర్తిచేశాం. కానీ గత ప్రభుత్వం వాటికి ఎక్కడా మౌలిక వసతులు మాత్రం కల్పించలేదని చెప్పారు. 103 యూఎల్‌బీలలో పనులు ప్రారంభిస్తే గత ప్రభుత్వం 88 యూఎల్‌బీలకు పరిమితం చేసి 15 వేల ఇళ్లను పూర్తిగా తొలగించింది. కేవలం 1,77,546 ఇళ్లు పూర్తి కాగా 84,094 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం నిధుల విషయంలో కూడా జీవోలు ఇచ్చింది తప్ప డబ్బులు ఇవ్వలేదు. లబ్ధిదారుల వాటా తగ్గించామని చెప్పి జీవోలు ఇచ్చారు తప్ప నిధులు ఎక్కడా విడుదల చేయలేదు. కాంట్రాక్టర్లకు ఇవ్వవలసిన రూ.3100 కోట్లు కూడా ఇవ్వలేదు. మిగిలిన ఇళ్లు, ఇన్‌ఫ్రా కోసం 3302 కోట్లు అవసరం.. మొత్తంగా ప్రాజెక్ట్ పూర్తికి రూ.7280 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి హడ్కో నుంచి రూ.4450 కోట్లు రుణం తీసుకుంటున్నాం. లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ల మీద రుణాలు రూ.1725 కోట్లు తీసు కుంటున్నాం. అమృత్ పథకం నిధులు రూ.225 కోట్లు ఖర్చు పెట్టేలా మొత్తం ప్రాజెక్ట్ డిజైన్ చేశాం.. మరో రూ.818 కోట్లు వివిధ రూపాల్లో తీసుకునే ఆలోచనలో ఉన్నాం. 2014-19లో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 52,192 మందిని అనర్హులుగా ప్రకటించి వారికి ఇళ్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఇళు నిర్మించకుండానే లబ్ధిదారుల పేరు మీద రుణాలు తీసుకుందని మంత్రి చెప్పారు. దీంతో బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు ఒత్తిడి రావడంతో రూ.140 కోట్లను తమ ప్రభుత్వం చెల్లించినట్లు వివరించారు. ఇళ్లకు అప్పటికే రంగులు వేసి నప్పటికీ గత ప్రభుత్వం పార్టీ రంగులు వేసుకుందని.. దీనికి సంబంధించి కూడా కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వలేదని తెలిపారు. ఇక ప్రతినెలా కట్టాల్సిన రూ.6 కోట్లు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మొత్తంగా వచ్చే జూన్ నాటికి 2,61,640 ఇళ్లను పూర్తి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించేలా ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఈలోగా ఇళ్లు పూర్తయ్యే చోట ప్రతి శనివారం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

## రాష్ట్రంలో 'టెక్స్‌టైల్స్' అభివృద్ధికి ప్రాధాన్యం

**- చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో టెక్స్ టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితతో సోమవారం టెక్స్‌టైల్స్ పరిశ్రమ యజమానులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇన్సెంటివ్‌లు, విద్యుత్ సరఫరాలో రాయితీలు, నూతన టెక్స్ టైల్స్ విధానంలో మార్పుల గురించి వివరించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల పరిశ్రమల నిర్వహణ భారంగా మారిందన్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం నెలకొందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ వేస్తోందన్నారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకోసం నూతన టెక్స్ టైల్స్ విధానం తీసుకొచ్చామన్నారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై ఫైనాన్స్, ఇండస్ట్రీస్, చేనేత, జౌళి శాఖ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు. టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ యజమానుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, తదితరులు పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యావ్యవస్థ

**- అందుకోసం మంత్రి లోకేష్ నిరంతర కృషి**
**- పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చర్యలు**
**- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



అద్దంకి (చైతన్యరథం): మన రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా అద్దంకిలో మంత్రులు డా.స్వామి గొట్టిపాటి రవికుమార్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మంత్రి డా.స్వామి సోదరి, అద్దంకి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డోలా సువర్ణ పద్మ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ.. తన సోదరి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా ఎన్ని ఒత్తిడిలు వచ్చినా నీతి, నిజాయితీతో విధులు నిర్వర్తించారన్నారు. విద్యా బోధనతోపాటు నైతిక విలువలు బోధిస్తూ అనేకమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గం చూపారన్నారు. అద్దంకి నియోజకవర్గంలో పదివేల మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సైకిళ్ళు పంపిణీ చేయడం అభినందనీయన్నారు. వైసీపీ హయాంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని, నేడు లోకేష్ మంత్రిగా విద్యా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని మంత్రి స్వామి తెలిపారు. విద్యార్థులకిచ్చే యూనిఫామ్ నుంచి బ్యాగ్‌లు, పుస్తకాల వరకు అన్నీ మంత్రి లోకేష్ స్వయంగా పర్యవేక్షిస్తారని చెప్పారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అనేక చర్యలు తీసుకుంటున్నారని మంత్రి డా.స్వామి అన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# గిరిజన సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ



ప్రత్తిపాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో 58 గిరిజన గ్రామాలు ఉన్నాయని, ఇవి ఇటు మైదాన ప్రాంతాలకు చెందకపోవడంతో పాటు, అటు ఏజెన్సీ పరిధిలో కూడా రాకపోవడం వల్ల గిరిజన ఉప ప్రణాళిక, ఐటీడీఏ సదుపాయాలు, సీఎస్ఆర్ నిధులు, ఎన్‌జీవో సహకారం వంటి అనేక అవకాశాలు గిరిజనులకు అందడం లేదని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వరపుల సత్య ప్రభ వ్యాఖ్యానించారు. సోమవారం గిరిజన సమస్యలపై అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్య, వైద్య సౌకర్యాలు, త్రాగునీరు, రహదారులు, కుల ధ్రువీకరణ పత్రాలు, సాగునీరు, జీసిసి కార్పొరేషన్ సదుపాయాలు లాంటి వసతులు అందక గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి పోతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో తప్పుడు తీర్మానాలు చేయించి, అమాయక గిరిజనుల హక్కులను హరించారని, ఆ కాలంలో రహదారులు, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, రైతాంగం, చెక్‌డ్యాములు, జీసిసి కార్పొరేషన్ వంటి అంశాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గిరిజన గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు, సమస్యల పరిష్కారం ఒక్కొక్కటిగా ప్రారంభమయ్యాయని తెలిపారు. "ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 58 గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలో చేర్చాలి. విద్య, వైద్య సౌకర్యాలను వికేంద్రీకరణ చేసి ప్రతి గిరిజన గ్రామానికి అందుబాటులో ఉంచాలి. పెదమల్లాపురం కేంద్రంగా ఒక కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలి. పెదమల్లాపురంలో జీసిసి కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, గిరిజనులకు అటవీ ఉత్పత్తుల విక్రయ సౌకర్యం కల్పించాలి. చెక్ డ్యాములు, సాగునీటి ప్రాజెక్టులను పునరుద్ధరించాలి. గిరిజనులకు ట్రైకార్ లోన్స్, వ్యవసాయ పరికరాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలి." అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు.

# శ్రీకాకుళం ఎస్పీ గ్రీవెన్స్‌కు 63 అర్జీల స్వీకరణ



శ్రీకాకుళం (చైతన్యరథం): ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి 63 ఫిర్యాదులు వచ్చాయి. వీటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. తన దృష్టికి వచ్చిన అర్జీలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకున్నామని చెప్పారు. వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

# భారీ వర్షం ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



బుచ్చయ్యపేట (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాజాం గ్రామంలో అప్పలనాయుడు చెరువు, ఊటవాని చెరువు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు చెరువులు పూర్తిగా నిండి పొర్లకట్ట నుంచి పొంగి ప్రవహిస్తున్నాయి. రాజాం నుంచి తట్టబద్ద వెళ్లే మార్గం పూర్తిగా జలమయమైంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న పలువురు కింద పడిపోయారు. మొబైల్ ఫోన్లు నీటిలో పడి కొట్టుకుని పోయాయి.

## మహిళల ఆరోగ్యం కోసమే
# స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్



రౌతులపూడి (చైతన్యరథం): మహిళల ఆరోగ్యం కోసమే 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌందర్య అన్నారు. మండలంలోని బలరామపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన శిబిరాన్ని బుచ్చి సీతయ్యమ్మ సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, సర్పంచ్ పైల సీత, సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, స్థానిక నాయకులు ప్రారంభించారు. శిబిరంలో 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారిణి తెలిపారు.

# బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు

- ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం... పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం



ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ- వాయవ్య దిశగా వాయవ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నెల నాటికి తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ 26 నాటికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల్లో వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది 27న దక్షిణ ఒడిశా -ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. రేపు, ఎల్లుండి ఉత్తరాంధ్రలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. అలాగే గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**పలు చోట్ల భారీ వర్షాలు :** ఆదివారం రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. దీని ప్రభావంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**నల్లమలలో భారీ వరద :** నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు నంద్యాల పట్టణంలోని చామకాలువ ఉధృతంగా ప్రవహించింది. చామ కాలువలో చేరిన వరద నీరు పట్టణంలో శ్యామనగర్‌లోకి వచ్చింది. ఎస్‌బీఐ కాలనీ సమీపంలో చామకాలువలో వరద నీరు వంతెన పై భాగాన్ని తాకింది. చామ కాలువ వరద నీటి ఉద్ధృతిని టీడీపీ జిల్లా కార్యదర్శి ఫిరోజ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టారు. శ్యామనగర్‌కు చెందిన 30 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి ఆధ్వర్యంలో అధికారులు అన్ని విధాల చర్యలను చేపట్టారు.

**మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు :** గుంటూరు నగరపు చుట్టుపక్కల భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షానికి రోడ్లపైకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు ముందుకు వెళ్లాల్సి వచ్చింది. మూడు వంతెనలు, కంకర గుంట అండర్ పాస్‌లోకి వాననీరు చేరటంతో ఆ మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిపేశారు. పాదచారులు భయం భయంగా నీటిలో రాకపోకలు సాగించారు.

**ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం :** కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు తాతకుంట్లకు మధ్యలో ఉన్న వెలుగు కార్యాలయం దగ్గరలో చెట్టుపై కరెంటు తీగలు పడి మంటలు చెలరేగాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్, టైలర్ పేట, జోడి బొమ్మలు సెంటర్, గొల్లపాలెం గట్టు మహంతిపురం, పాతబస్తీలోని కొన్ని వీధులు, రహదారులు జలమయమయ్యాయి.

**నీట మునిగిన బస్టాండు పరిసర ప్రాంతాలు :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బస్టాండు లోపల మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరింది. దీంతో బస్సులు బస్టాండు లోపలికి వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. బస్టాండు పరిసర ప్రాంతాలన్నీ నీటి మునగడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. భారీ వర్షాలకు తిరువూరు మండలం లక్ష్మీపురం- మల్లెల గ్రామాల మధ్య అలుగుపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో విస్సన్నపేట-తిరువూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు గంపలగూడెం మండలంలోని కట్టెలేరు వంతెన రహదారిపై వరద ఉద్ధృతి పెరిగింది.

# సంగీత కళాశాలలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని సంగీత కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయవాడ ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య కార్యక్రమం కన్నుల పండువుగా సాగింది. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్యాచార్య చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ వారి శిష్య బృందంచే కూచిపూడి నృత్య రవళి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారులు చంద్రిక, సుప్రియ, యశస్విని, భార్గవి, చార్విశ్రీ, తుషార వెన్నెల, నిత్య లు ప్రదర్శించిన గణేష్ స్తుతి, గరుడ గమన, కృష్ణం కలయసఖి, శ్రీ శారదాంబ, ఓం శర్వాణి కూచిపూడి నృత్యాకు ఆద్యంతం ప్రేక్షకులకు కనువిందు చేసింది.

**సంగీత వాయిద్యాల కార్యక్రమం**

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం సాయంత్రం 6.45గంటలకు సంగీత వాయిద్యాలతో సంగీత కార్యక్రమం కన్నుల పండువుగా సాగింది. ఈ కార్యక్రమంలో సంగీత గురువులు శ్రీ గండూరి శ్రీనివాస మూర్తి వారి శిష్య బృందం చే సంగీత సంకీర్తన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత వాయిద్య కళాకారులు ఆలపించిన వాతాపి గణపతి,అంబవాన్ని, మాయాహిత స్వరూపిణి,మరకత వల్లీమ్ సరోజినీ దళయెత్రి సంగీత ఆలాపనలు శ్రోతలను బాగా అలరించింది. సంగీతాన్ని ఆలపించిన వాళ్ళు పి.నాగ పూజిత, జి.ఎల్ హర్షిత, జి.ఎల్ ప్రణతి, సి.హెచ్. శ్రీదేవి, కె.యశస్వినీ దత్త, ఏ సర్వజ్ఞ, వయలిన్ సహకారం కే. గౌరీ కృష్ణ శ్రీ, మృదంగం కే. కళ్యాణ్ సాయి ఈశ్వర్‌లు అందించారు.

**ఆంధ్ర నాట్యం నృత్య కార్యక్రమం**

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం రాత్రి 7.30గంటలకు ఆంధ్రనాట్య నృత్య కార్యక్రమం కన్నుల పండువుగా సాగింది. ఈ కార్యక్రమంలో శ్రీ పిల్ల ఉమా మహేశ్వర పాత్రుడు శిష్యబృందంచే ఆంధ్ర నాట్య నృత్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తమ్మిన చిన్మయి, భార్గవి, షర్మిల, మహేష్, మానసలు కుంభ హారతి, శ్రీ చక్ర రాజా, ఆనంద నర్తన గణపతి, వారాహిలు ప్రదర్శించిన ఆంధ్రనాట్య నృత్యములు ఆద్యంతం ప్రేక్షకులకు కనువిందు చేసింది.

**హరికథ కార్యక్రమం**

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం రాత్రి 8గంటలకు హరికథ కార్యక్రమం కన్నుల పండువుగా సాగింది. ఈ కార్యక్రమంలో కళాకారిణి సప్పా భారతి హరికథ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది.

**మ్యాజిక్ షో కార్యక్రమం**

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం రాత్రి 8.30గంటలకు మ్యాజిక్ షో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకినాడ కు చెందిన సతీష్ చేసిన మ్యాజిక్ విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి.సతీష్ చేసిన మ్యాజిక్ షోకు చిన్నపిల్లలు కేరింతలు కొట్టారు.

**డ్రామా షో కార్యక్రమం**

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరావు సంగీత కళాశాలలో సోమవారం రాత్రి 9గంటలకు డ్రామా షో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యం శివం సుందరం గ్రూప్ డ్రామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

## పర్యాటక అభివృద్ధి ద్వారా రాజధాని అమరావతికి
# విజయవాడను మణిహారంగా నిలబడమే లక్ష్యం..

**●విజయవాడ ఉత్సవ్ ప్రారంభోత్సవ వేదికపై ప్రారంభ ఉపన్యాసం ఇచ్చిన ఎంపీ కేశినేని శివనాథ్..**

**●ఎంపీ కేశినేని శివనాథ్ పై ప్రశంసల వర్షం కురిపించిన మంత్రి నారా లోకేష్..**




విజయవాడ (చైతన్యరథం): దసరా శరన్నవరాత్రి వేళ విజయవాడ నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువైన అమ్మవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది భక్తులతో పాటు, పర్యాటకులు, సందర్శకులకు విశేష అనుభూతి కలిగించేలా "విజయవాడ ఉత్సవ్" సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చీకటిని చీల్చుకుంటూ ఆకాశంలో మిరుమిట్లు గొలుపేలా నిర్వహించిన క్రాకర్స్ షో నగర వాసులకు కనువిందు చేసింది. డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవ వేదికపై ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... "విజయవాడ ఉత్సవ్ కేవలం సాంస్కృతిక వేడుక మాత్రమే కాదని, ఇది మన నగర గౌరవం, ప్రతిష్టకు ప్రతీక. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక, పర్యాటక రంగాలలో విజయవాడ మరింత ముందుకు దూసుకెళ్లే పునాది ఈ ఉత్సవమే" అని పేర్కొన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా నగరానికి వచ్చే సందర్శకులు మరపురాని అనుభూతిని పొందేలా హెలికాప్టర్ రైడ్స్, ఎగ్జిబిషన్లు, భారీ కార్నివల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేశామని, స్థానిక కళాకారులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు కూడా ఈ ఉత్సవంలో పాల్గొని నగరానికి ప్రత్యేక మేళవింపును అందిస్తున్నారని తెలిపారు. ఈ ఉత్సవం విజయవంతం కావడానికి సహకారం అందిస్తున్న అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, కళాకారులు, వ్యాపార వర్గాలు, ప్రజలు అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని ఎంపీ శివనాథ్ అన్నారు.

**ఎంపీ కేశినేని శివనాథ్‌ను అభినందించిన మంత్రు లోకేష్..**

విజయవాడ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు రంగాలకు చెందిన ప్రముఖుల సహకారంతో "విజయవాడ ఉత్సవ్" నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ ఆహ్వాన పత్రిక అందించడానికి వచ్చిన సందర్భంలో తాను నవ్వుకున్నానని, ఈ ఉత్సవ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీ శివనాథ్ నగరంలో ఐదు వేదికలు ఏర్పాటు చేసి అద్భుతంగా నిర్వహిస్తున్నారని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసలు వర్షం కురిపించారు. విజయవాడ నగరాన్ని ప్రపంచ స్థాయిలో నిలిపేలా ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఎంపీ శివనాథ్‌ను వేదికపై నుంచి మంత్రి లోకేష్ అభినందించారు.

## విజయవాడ ఉత్సవ్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్... ఎంపీ హర్షం




విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని.. విజయవాడ ఉత్సవ్‌కు ఉన్న అన్ని అడ్డంకులు తొలిగాయి అన్నారు.. అమ్మవారి ఆశీస్సులతో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు

విజయవాడ (చైతన్యరథం): వైబ్రెంట్ విజయవాడ ఉత్సవాలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. బెజవాడ దుర్గ గుడి భూముల్లో వైబ్రెంట్ విజయవాడ ఉత్సవ్ పేరుతో వాణిజ్య కార్యకలాపాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది సుప్రీంకోర్టు.. కేసు విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం.. విజయవాడ ఉత్సవ్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించిన సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. ఈ నెల 24వ తేదీ నుంచి ఎగ్జిబిషన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు.. అయితే, కృష్ణా నది వరద ఉధృతి కారణంగా వాటర్ స్పోర్ట్స్ రద్దు చేశాం అని వెల్లడించారు.. కానీ, వరద ఉధృతి తగ్గాక వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు ఎంపీ కేశినేని చిన్ని... కాగా, దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ముందు హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది.. విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో గొడుగుపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానికి సంబంధించిన దేవాదాయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. దేవాదాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని ఆదేశాలు జారీ చేసింది.. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించింది.. అందులో తోలిన గ్రావెల్, మట్టి, కంకరలను వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చింది.. అంతేకాదు, ఆ భూములను యథాస్థితికి తీసుకు రావాలని ఆదేశించింది.. దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్ను ఆశ్రయించగా.. విజయవాడ ఉత్సవ్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.. కానీ, ఈ వ్యవహారంపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. ఈ విషయంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పిటిషన్ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది సుప్రీంకోర్టు..

## తెనాలిలో కలరా కలకలం... సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కలరా



తెనాలి (చైతన్యరథం): గుంటూరు జిల్లా తెనాలి మండలంలో మహమ్మారి 'కలరా' కలకలం రేపుతోంది. అంగలకుదురు గ్రామంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ మహిళకు కలరా వ్యాధి నిర్ధారణ అయింది. సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయిన సదరు మహిళ ప్రస్తుతం తాడేపల్లిలోని మణిపాల్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మహిళ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని, మరో 2-3 రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. మహిళకు కలరా వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి... అంగలకుదురు గ్రామానికి చెందిన ఇంటూరి దీపిక (33) హైదరాబాద్లో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. హైదరాబాద్లో ఆమె డెంగ్యూతో బాధపడుతూ.. ఈనెల 14న స్వగ్రామం అంగలకుదురుకు వెళ్లారు. చికిత్స తీసుకున్నా వాంతులు, విరేచనాలు తగ్గలేదు. ఈనెల 18న దీపిక డయేరియా లక్షణాలతో బాధపడుతూ.. తాడేపల్లిలోని మణిపాల్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. 19న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. కలరా సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ అధికారులు ఆమెకు మెరుగైన చికిత్స అందించారు. అంగలకుదురు గ్రామంలో వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఆదివారం వరకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. 1100 ఇళ్లలో నాలుగు వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ కలరా ఆనవాళ్లు లేవు. దాంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అంతా అదుపులోనే ఉందని, భయపడాల్సింది ఏమీ లేదని అధికారులు చెబుతున్నారు.

## విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

**●అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీలో కోరారు. శాసనసభ వర్షా కాల సమావేశంలో భాగంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన యార్లగడ్డ విమానాశ్రయ విస్తరణ కోసం 2015వ సంవత్సరం గన్నవరం మండలంలోని దావాజీగూడెం, బుద్దవరం, అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో 835 ఎకరాల భూమిని సేకరించారని భూములు ఇచ్చిన రైతుల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విన్నవించారు. విమానాశ్రయ విస్తరణలో 423 మంది ఇళ్ళు కోల్పోగా వారిలో 300 మంది పేద ఎస్సీలు ఉన్నారని తెలిపారు. ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కోసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఒక్కొక్కరికి ఐదు సెంట్లు భూమిలో ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు కాలనీ ఏర్పాటు చేశారని ఈ కాలనీలో కనీస వసతులు లేవని, ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు రూ.80 కోట్లు కేటాయించాలని కోరారు. ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు ఒక్కొక్కరికి తొమ్మిది లక్షల పరిహారంగా ఇవ్వాల్సి ఉందని ఇందు నిమిత్తం రూ.59 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దావాజీగూడెంలో మైక్రో కాల్వ నిర్మాణం కోసం 45 ఇళ్ళు తొలగించారని నిర్వాసితులకు వారికి రూ.50 వేలు చొప్పున అద్దె ఇవ్వాల్సి ఉందన్నారు. విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు రూ.27 కోట్లు కౌలు బకాయిలు విడుదల చేయాలని యార్లగడ్డ కోరారు. రూ.459 కోట్లతో చేపట్టిన విమానాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. విమానాశ్రయ విస్తరణ కోసం సీతారామచంద్రస్వామి ఆలయం, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల భూములు 4.30 ఎకరాలు సేకరించారని ఆ భూములకు రాజధానిలో భూముల కేటాయించాలని అసెంబ్లీలో యార్లగడ్డ కోరారు.

## సీడ్స్ ఛైర్మన్ మండవ వెంకట్రామయ్య కన్నుమూత

నూజివీడు (చైతన్యరథం): మండలంలోని తుక్కులూరు నివాసి నూజివీడు సీడ్స్ ఛైర్మన్ మండవ వెంకట్రామయ్య(95) సోమవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1972లో నూజివీడు సీడ్స్‌ను స్థాపించిన ఆయన దాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. వేల సంఖ్యలో రైతులు పత్తిని సాగు చేసి దినదినాభివృద్ధి సాధించేందుకు దోహదపడ్డారు. మండవ ఫౌండేషన్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురికి చేయూత అందించారు.

## అంతరించిపోతున్న కళల సంరక్షణే లక్ష్యంగా విజయవాడ ఉత్సవ్




విజయవాడ (చైతన్యరథం): నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో విజయవాడ ఉత్సవ్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం నృత్యాలతో పాటు వివిధ నాటికల ప్రదర్శనలతో ఆధ్యాంతం విజయవాడ ఉత్సవ్ ఆకట్టుకుంటుంది. కళాకారులు ప్రదర్శిస్తున్న వివిధ కళారూపాలు వీక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... అంతరించిపోతున్న కళల సంరక్షణే లక్ష్యంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. విజయవాడ ఖ్యాతినీ పెంచే విధంగా కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, ఈ నేపథ్యంలో విజయవాడకు వన్నె తెచ్చే విధంగా విజయవాడ ఉత్సవ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహించడం ముదావహం అన్నారు. గత ఐదేళ్లు నాటక రంగంపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. నాటక రంగానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విజయవాడ ఉత్సవ్ అడ్డుకోవాలని కొన్ని శక్తులు పనిచేశాయన్నారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో విజయవాడ ఉత్సవ్ జరుగుతుందని చెప్పారు. విజయవాడ ఉత్సవ్ విజయవాడ ఖ్యాతిని పెంచుతుందని, రాష్ట్ర నలుమూలల విజయవాడ వైభవాన్ని కనబరుస్తోంది అన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు నిర్వహించిన కార్యక్రమాలలో నాట్యాచార్య ఏ సంతోష్ బృందం ప్రదర్శించిన భారత నాట్యం, అంజనా సుధాకర్ ఆధ్వర్యంలో ఆలపించిన సంగీత ప్రదర్శన, అంబికా బృందంచే ప్రదర్శించ బడిన కూచిపూడి నృత్యం, ప్రగతి కళాశాల బృందంచే ప్రదర్శించ బడిన కర్రసాము, చెంచు లక్ష్మి శ్రీ సరస్వతి నాట్య మండలి వారిచే ప్రదర్శించ బడిన యక్ష గానం పౌరాణిక నాటికలు ఆద్యంతం కన్నుల విందు చేశాయి.

# అలుగు పారుతున్న ఆకవీడు చెరువు

రాచర్ల, చైతన్యరథం): నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ ప్రవాహం కొనసాగుతోంది. మండలంలోని ఆకవీడు చెరువు ఇటీవల కాలంలో అలుగు పారుతోంది. ఆ నీరు గ్రామం మధ్యలో నుంచి వెళ్లోంది. దీంతో ఆరవీటికోట గిద్దలూరు



ప్రధాన రహదారిపై మోకాలిలోతుకు పైగా నీరు చేరింది. దీంతో రాకపోకలకు గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలుగు నీరు వెళ్లే కాలువ ఆక్రమణలకు గురికావడం, ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెన మరమ్మతులకు గురికావడంతో నీరు రోడ్డుపైకి చేరుతోంది. గ్రామంలో సుమారు 5 వేల జనాభా నివాసం ఉంటోంది. ప్రస్తుతం ప్రజలు నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి తెలిపారు.



పెద్దారవీడు గ్రామంలో పెద్దారవీడు, చట్లమిట్ల సొసైటీ చైర్మన్‌ల ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా పీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మార్కాపురం, యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్లు, అధికారులు, టీడీపీ కూటమి నాయకులు

# రోడ్డు ప్రమాదాలను అరికట్టండి

**కొత్త కలెక్టర్, ఎస్పీ సమన్వయంతో నడుంకట్టాలి, నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి పిలుపు**



కోవూరు, (చైతన్యరథం): కొత్తగా వచ్చిన కలెక్టర్, ఎస్పీ తక్షమే జిల్లా రహదారి మండలి సమావేశం ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి కోరారు. కోవూరులోని తన కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో నెల్లూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి అనేకమంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పరిధిలో 2020 లో 943 రోడ్డు ప్రమాదాలు జరిగి 398 మంది చనిపోగా, 2021లో 977 ప్రమాదాలు జరిగి 466 మంది మృత్యువు పాలయ్యారన్నారు. 2022 లో 884 ప్రమాదాలు జరిగి 368 మంది,2023 లో 894 ప్రమాదాలు జరిగి 433 మంది, 2024 లో 820 ప్రమాదాలు జరిగి 450 మంది చనిపోయారు. ఈ ఏడాది ఇప్పటికే 663 ప్రమాదాలు జరిగి 384 మంది చనిపోయారన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, తెల్లవారు జామున ప్రయాణాలు, మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, ఓవర్ టేక్ తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నప్పటికీ వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గత మూడు క్యాలండర్ సంవత్సరాల్లో ముగ్గురు కంటే ఎక్కువగా, ఒకే ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో మరణించివుంటే, ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తించి, ఆ ప్రాంతంలో ప్రమాదాలు నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. జాతీయ రహదారులు అధికారులు అటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ప్రాంతాల్లో ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం వల్ల బ్లాక్ స్పాట్ గుర్తించిన ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. జాతీయ రహదారుల అధికారులు నిర్లక్ష్యం వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా స్థాయిలో కలక్టర్ కన్వీనర్‌గా ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులతో జిల్లా రహదారి భద్రతా మండలి ఉందన్నారు. ఈ భద్రతా మండలి ఎప్పటికప్పుడు సమావేశమై జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి చర్చించి,ప్రమాదాల నివారణ కు చర్యలు తీసుకోవాల్సి ఉండగా,సమావేశాలు జరపడటం తప్ప చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. ఈ సమావేశాల్లో రూపొందించిన కార్యాచరణ మాటలకే పరిమితం అవుతోందన్నారు. అందువల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతూ రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. విలువైన ప్రాణాలు కోల్పోయి బాధిత కుటుంబాలలో విషాదం నెలకొంటుంది. జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్, ఎస్పీ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే జిల్లా రహదారి భద్రత మండలి సమావేశం ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నగదు రహిత ఉచిత చికిత్స గురించి కూడా అందరికీ అవగాహన కలిగించాలని చేజెర్ల కోరారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించండి

**నెల్లూరు కమిషనర్ నందన్‌కు టీడీపీ నేత ధర్మవరం విన్నపం**

నెల్లూరు, (చైతన్యరథం): టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు మున్సిపల్ కమిషనర్ ఓవై నందన్‌కు పలు ప్రజా సమస్యలు ఏకరువు పెడుతూ వినతిపత్రం అందజేశారు. కంసాలి వీధిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులుఇబ్బందులు పడుతున్నారని, పరిష్కారంగా కల్వర్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, భద్రతా పరికరాలు, శాశ్వత ఉద్యోగాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. కామాటీ వీధిలో వాలిన విద్యుత్ స్తంభాన్ని తక్షణమే మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, అధ్యక్షులు చెంగయ్య, ప్రధాన కార్యదర్శి కల్వకుంట భాస్కర్, ఉపాధ్యక్షుడు మదనం, భేటీ మునిశేఖర్, గౌరవ అధ్యక్షుడు సిద్ధకళాచారి, బూత్ ఇంచార్జీలు నీలకంఠం మునికృష్ణ, కంచి కృష్ణ, వీరమల్లు చంద్ర, కంచి రాధాకృష్ణ, సురేందర్ సింగ్ పాల్గొన్నారు.



# తిరుమలకొండపై పులివెందుల మార్కు దందా నడిపిన దుర్మార్గుడు కరుణాకరరెడ్డి

**చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ నేతల ధ్వజం**

చిత్తూరు, (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల కొండపైన కరుణాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి హయాంలో పులివెందుల మార్కు దందా జరిగిందని చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు విరుచుకుపడ్డారు. తిరుమల క్షేత్రంలో కూడా పులివెందుల సెటిల్మెంట్లు ప్రవేశపెట్టిన ఘనత భూమన కరుణాకర్ రెడ్డిదేనన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మిక క్షేత్రం తిరుమలలో పరకామణిలో రవికుమార్ అఎ దొంగ తిరుమల శ్రీవారి హుండీలో డాలర్లు దొంగలిస్తే, ఆ దొంగని కఠినంగా శిక్షించాల్సింది పోయి, దొంగ దగ్గర నుండి వాటాలు పంచుకొని, ఆ దొంగ దగ్గర నుండి శ్రీవారికి 14 కోట్ల రూపాయలు విలువైన ఆస్తిని గిఫ్ట్ డీడ్ ఇచ్చి ఏదో పెద్ద మేలు చేసిన వాడిలాగా ఫోజులు కొడుతున్నారన్నారు. శ్రీవారి దగ్గర దోచుకున్న డబ్బుని మళ్లీ శ్రీవారికి గిఫ్ట్ డీడ్ ఇచ్చిన ఘనత కూడా కరుణాకర్ రెడ్డికి, గజదొంగ రవికుమార్‌కే దక్కిందన్నారు. అసలు ఈ కేసులో కఠినంగా శిక్షించాల్సింది పోయి దొంగ దగ్గర నుండి కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డి, తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు పంచుకొని మహా పాపానికి ఒడి కట్టడమే కాకుండా,




మా నాయకుడు నారా లోకేష్ పైన, అదే విధంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పైన అవాకలు చవాకులు పేలుతూ... సవాళ్లు... ప్రతి సవాళ్లు విసురుతున్నాడన్నారు. వాళ్ల తీరు దొంగే దొంగ.. దొంగ.. అని అరచినట్లుందన్నారు. త్వరలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామివారి భక్తుల్ని మనోభావాన్ని దెబ్బతీయడానికి భూమన ఇటువంటి కుట్రలు పన్నుతున్నాడన్నారు. సాక్షాత్తు హైకోర్టు జోక్యం చేసుకొని లోకాయుక్త ఇచ్చిన తీర్పుని సస్పెన్షన్‌లో పెట్టి, బోర్డు రికార్డును కూడా స్వాధీనం చేసుకోమని చెప్పడం టీటీడీ చరిత్రలోనే మొట్టమొదటిసారి జరిగిందన్నారు. అసలు స్వామివారికి ఎవరైనా గిఫ్ట్ డీడ్ ఇవ్వాలంటే, దానిపైన పత్రికలలో ప్రకటన ఇచ్చి, ఎటువంటి అభ్యంతరాలు లేవని తేలిన తర్వాతనే గిఫ్ట్ తీసుకోవాలని నిబంధన ఉందన్నారు.

దీన్ని స్పెషల్ కేసుగా గుర్తించి, కనీసం పత్రికలలో ప్రకటన ఇవ్వకుండా స్వామివారి దగ్గర కొట్టేసిన డబ్బులతో కొన్న ఆస్తుల్ని మళ్ళీ స్వామివారికి గిఫ్ట్ డిడ్ ఇచ్చి స్వామి వారికే శఠగోపం పెట్టే ప్రయత్నం గజదొంగ రవికుమార్, కరుణాకర్ రెడ్డి చేయటం భక్తులకు పట్టిన దరిద్రమన్నారు. తన పాత్ర నిరూపిస్తే తలనరుకుకుంటానని భూమన ఫోజులు కొడుతున్నాడన్నారు. చేసిన పాపాలన్నిటికీ సమాధానం చెప్పవలసి వస్తుందని ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్‌లో రాష్ట్ర అధికార ప్రతినిధి తెలుగుదేశం పార్టీ పార్టీ సప్తగిరి ప్రసాద్ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు యువరాజు నాయుడు పాల్గొన్నారు.

# కరువు సీమపై కనికరం చూపండి

**ఆర్డీటీ రాయలసీమకు జిల్లాకు గొప్ప వరం.. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయించి సంస్థను కాపాడండి, వేరుసెనగ, టమోటా, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి, అసెంబ్లీలో వాణి వినిపించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

రాప్తాడు, (చైతన్యరథం): దేశంలోనే అత్యంత కరవు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఆర్డీటీ సంస్థ ఒక వరం లాంటిదని.. ఆ సంస్థను కాపాడాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే సునీత జీరో అవర్‌లో ఆర్డీటీ సమస్య గురించి, లఘు చర్చ సందర్భంలో వ్యవసాయ రంగంలో ఉన్న సమస్యల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. గత 50సంవత్సరాలకు పైగా అనంతపురం జిల్లాలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 152 మండలాల్లో, సుమారు 4వేల గ్రామాల్లో, 5లక్షల కుటుంబాలకు ఈ సంస్థ ద్వారా సేవలందుతున్నాయన్నారు. సుమారు 20లక్షల మందికి పైగా ఈ సంస్థపై ఆధారపడ్డారన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడలపరంగా ఈ సంస్థ చాలా సేవలందిస్తోందన్నారు. ఆర్డీటీ అంటే ఏ పార్టీకో, కులానికో, మతానికో సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయకపోవడం వల్ల కీలకమైన సేవలు ఆగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు రాష్ట్ర ఎంపీల సహకారంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షాని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన లేదని.. అందుకే సభ ద్వారా కేంద్రానికి ప్రతిపాదన పంపించాలన్నారు. ఇప్పటికే మంత్రి లోకేష్ మాంచో ఫెర్రర్ తో సమావేశమై ఆర్డీటీ సేవలు ఆగకుండా కొనసాగేలా కేంద్రంతో మాట్లాడతామని హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## మా జిల్లా రైతులను ఆదుకోండి

అసెంబ్లీ సమావేశాల్లో రెండవ సారి లఘు చర్చ సందర్భంలో ఎమ్మెల్యే పరిటాల సునీతకు అవకాశం రాగా.. జిల్లా రైతుల ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో కేవలం వర్షాధారంగానే 7లక్షల హెక్టార్ల వరకు పంటలు సాగవుతాయని.. ప్రతి ఏటా అతివృష్టి లేదా అనావృష్టి వల్ల పంటలు నష్టపోతున్నారన్నారు. మాకు ప్రధాన పంట వేరుసెనగ అని.. ప్రతి ఏటా పంటలు వేయడమే తప్ప లాభం తీసుకున్న సందర్భాలే లేవన్నారు. కనీసం పెట్టుబడులు కూడా రాక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు. ఈసారి కూడా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద 7వేల రూపాయలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో వర్షాలు సకాలంలో రాక పంటలు వేయలేకపోయారన్నారు. అరకొరగా విత్తనం సాగైనా.. వర్షాలు లేక అది ఎండిపోయిందన్నారు. ఆగష్టు నెలలో కురిసిన వర్షానికి కొంత వరకు పంట సాగైనా అది కూడా సరిగా లేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇన్సూరెన్స్ వ్యవస్థను నాశనం చేశారన్నారు. ప్రీమియం మేమే చెల్లిస్తామంటూ.. రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు మరోసారి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. కాకపోతే ఈ ఏడాది ఇన్సూరెన్స్ కొంత మంది చేసుకోలేకపోయారన్నారు. అక్కడక్కడ ఈ-క్రాప్ కూడా చేయించుకోలేదన్నారు. అలాంటి రైతులకు మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు వేరుసెనగకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది, ఆముదం పంటలు వేస్తున్నారన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్లో మొక్కజొన్న ధరలు పడిపోతున్నాయని.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. అలాగే టమోటా ధరలు తగ్గాయని ఈ విషయంలో కూడా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా టోమోటా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా సహకారం అందించాలన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు 50వేలు ఇస్తుంన్నందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ధన్యవాదాలు తెలిపారు.



## తిరుమల శ్రీవారికి ఖరీదైన కానుకలు

తిరుమల, (చైతన్యరథం): తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి చెన్నైకి చెందిన ఓ అజ్ఞాత భక్తుడు విలువైన బంగారు కానుకలు సమర్పించారు. సాధారణ రాళ్లు పొదిగిన 9 బంగారు పతకాలను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అధికారులను కలుసుకొని ఈ పతకాలను అందజేశారు. వీటి విలువ రూ.కోటి ఉంటుందని అంచనా.

## వైభవోపేతంగా దసరా ఉత్సవాలు

## దేదీప్యమానంగా ముస్తాబయిన శ్రీశైలం



శ్రీశైలం, (చైతన్యరథం): శ్రీశైల మహాక్షేత్రం దసరా మహెూత్సవాలకు ముస్తామయింది. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా మహెూత్సవాలు అంగరంగ వైభవంగా జరపడానికి పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి. ఉదయం 9 గంటలకు భ్రమరాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు శ్రీకారం చుట్టి అంకురార్పణ పూజలు చేశారు. సాయంత్రం భక్తులకు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామి. అమ్మవార్లకు భృంగి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

# చేనేతకు చేయూత

**ఇటు రాష్ట్రం, అటు కేంద్రం సహకారంతో ధర్మవరంలో రూ.35 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు**

ధర్మవరం, (చైతన్యరథం): చేనేత కేంద్రమైన ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. రూ.35 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వ సహకారం అందిస్తోంది. ఇప్పటికే క్లస్టర్ ఏర్పాటుకు రూపొందించిన డీపీఆర్ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపింది. చేనేత మగ్గాలు నేస్తున్న 10,200 మందిని చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించి వారి జాబితాను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపారు. క్లస్టర్ ఏర్పాటుకు ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో పది ఎకరాల స్థలాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. ఇప్పటికే అనుమతులు తెచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిల్లీ పర్యటన చేశారు. చేనేతల 20 ఏళ్ల ప్రయ త్నాలు కూటమి ప్రభుత్వంలో సఫలమయ్యాయి. ధర్మవరంలో మెగా క్లస్టర్లో రూ.5కోట్లు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందులో చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన కార్మికులకు 90 శాతం రాయితీతో వివిధ పరికరాలు ఇవ్వనున్నారు. మెగా క్లస్టర్ ఏర్పాటు చేసే ప్రాంతంలోనే డిజిటల్ స్టుడియో ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల డిజైన్లను చేనేత డిజైనర్లు రూపొందించి వాటిని డిజిటల్ స్టుడియోలో అందుబాటులో ఉంచుతారు. పట్టుచీరపై డిజైన్లు రూపొందించేందకు గాను శిక్షణ ఇవ్వనున్నారు. క్లస్టర్ ఆవరణలోనే సామూహిక షెడ్లు నిర్మించనున్నారు. చేనేతలకు అవగాహన కల్పించేందుకు తమిళనాడులోని కంచిలో ఉన్న మెగా క్లస్టర్ సందర్శనకు ఇటీవల ధర్మవరం చేనేత కార్మికులను చేనేత జౌళిశాఖ అధికారులు తీసుకెళ్లడం విశేషం.





ఒంటిమిట్ట కోదండ రామయ్య సన్నిధిలో
మరో భవన సముదాయం కోసం ఎంపిక చేసిన స్థలం

# అవకాశం ఇస్తే పాడ్‌కాస్టుల్లో కథలల్లేస్తారు

## తుది నివేదిక వచ్చేవరకూ నిగ్రహంగా ఉండండి - ఎయిర్ ఇండియా ప్రమాదఘటన విచారణ నివేదికలపై సుప్రీం

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు నోటీసులు ఇచ్చింది. జూన్ నెలలో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు ఏఏఐబీ సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్... మరో పైలట్‌ను పశ్నించాడని రిపోర్టులో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ



వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు ఆ నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎయిరిండియా విమానం పైలటే ఇంధన స్విచ్‌ను షట్ డౌన్ చేశారంటూ ఊహాజనిత వార్తలు ప్రచురించాయి.

దర్యాప్తు కొనసాగుతున్న దశలో ఇటువంటి చర్యలు బాధ్యతారాహిత్యంతో కూడినవని అప్పట్లో ఏఏఐబీ ఖండించింది. ఈ నేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ఫ్లైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది. "న్యాయపరమైన, నిష్పాక్షిక దర్యాప్తు వరకు చూసుకుంటే అది ముఖ్యమే. కానీ ఆ వివరాలన్నీ బహిర్గతం చేస్తే, పాడ్కాస్టుల్లో కొత్త సిద్ధాంతాలు అల్లేస్తారు. ఎవరైనా బాధ్యతారహితంగా పైలట్ తప్పు అని చెప్తే.. అది ఆ కుటుంబంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఒకవేళ.. తుది నివేదికలో పైలట్ పేరు లేకపోతే.. అప్పుడు ఏం చేస్తాం?" అని ప్రశ్నించింది.

## నా రీల్స్ చూడడం ఆపి..
## పంజాబ్ కష్టాలను చూడండి

**- ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు ఢిల్లీ సీఎం రేఖాగుప్తా చురకలు**



ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ సీఎం రేఖాగుప్తా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన రీల్స్ చూడటం ఆపేయాలని చురకలు అంటించారు. రేఖా గుప్తా మాట్లాడుతున్నట్టుగా ఉన్న ఒక వీడియోను ఆదివారం అరవింద్ కేజీవాల్ షేర్ చేశారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై ఆమె మాట్లాడుతున్నట్టుగా అందులో ఉంది. "70 ఏళ్లపాటు కాంగ్రెస్ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినంతకాలం అంతా బాగానే ఉంది. ఇప్పుడు మేం చేస్తే మాత్రం వారు బాధపడుతున్నారు... వారు విజయం సాధిస్తే.. ప్రజాతీర్పు అంటారు. మేం గెలుపొందితే, ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని ఆరోపిస్తారు. రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూనే ఉంటారు" అని సీఎం చెప్తున్నట్టుగా ఆ వీడియో ఉంది. సీఎం ఏం మాట్లాడుతున్నారు..?" అని ఆ క్లిప్పు ఎక్స్ వేదికగా కేజ్రివాల్ పోస్టు చేశారు. ఆదొక ఎడిటెడ్ వీడియో అని భాజపా తోసిపుచ్చింది. తాజాగా ఇదే అంశంపై రేఖా గుప్తా కూడా స్పందించారు. కార్యకర్తలతో మాట్లాడుతూ.. కేజ్రీవాల్ సర్, నాకు సంబంధించిన రీల్స్ ఇంటర్వ్యూలు చూడటం తగ్గించుకోవాలి. మేడమ్ ఏం చెప్పారు.. ఏం చెప్పలేదో తెలుసుకునేందుకు రోజంతా మీరు నా రీల్స్ చూస్తున్నారని అనుకుంటున్నాను. ఆయన నిజంగా దృష్టి పెట్టాలనుకుంటే. వరదలతో ఇబ్బందిపడిన పంజాబ్ ప్రజల గురించి ఆలోచించండి. ఆయన బాధితుల దగ్గరకు వెళ్లినట్లు నాకైతే కనిపించలేదు" అని సెటైర్ వేశారు. పంజాబ్‌లో ఆద్మీపార్టీ అధికారంలో ఉంది.

## సన్మార్గం నడుస్తూ ప్రజలకు సేవచేయాలి

**నటుడు విజయ్‌కు కమల్ హాసన్ సూచన**

బహిరంగ సభలకు, సమావేశాలకు వచ్చే జనమంతా ఓట్లు వేయరని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ పేర్కొన్నారు. ఇది టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు మాత్రమే కాదని, తనకూ వర్తిస్తుందని అన్నారు. చెన్నైలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ నిర్వహిస్తోన్న ప్రచార సభలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. దీనిపై రాష్ట్ర నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. దీనిపై తాజాగా కమల్ హాసన్‌కు ప్రశ్న ఎదురైంది. "సభలకు వచ్చే జనమంతా ఓటేయ్యరు. కచ్చితంగా అంతా ఓటింగ్‌గా మారదు. ఇది నాయకులందరికీ వర్తిస్తుంది. ఇందుకు విజయ్ మినహాయింపేమీ కాదు. నాతో సహా భారత్‌లో ఉన్న నేతలందరికీ ఈ మాట వర్తిస్తుంది" అని అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్‌కు ఏం సలహా ఇస్తారని అడగ్గా.. సన్మార్గంలో ధైర్యంగా ముందుకుసాగుతూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అందరికీ ఇదే విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. రాజకీయ నేతలే కాదు.. సినిమా రంగంలో ఉన్నవారు విమర్శలను ఎదుర్కొంటారని అన్నారు. అప్పుడే అడుగుపెట్టిన వారిని విమర్శలు వదలవని వ్యాఖ్యానించారు. రెండురోజుల క్రితం తిరువారూర్‌లో జరిగిన ఓ సభలో విజయ్ మాట్లాడుతూ ఒక అనుమానం వ్యక్తం చేశారు. "సభకు వచ్చే జనాలంతా ఓట్లేయరని అంతా అంటున్నారు. అది నిజమా..?" అని అడిగారు. దానికి అక్కడున్న జనమంతా 'విజయ్' అని నినదించారు. పరోక్షంగా తాము విజయ్‌కు ఓటేస్తామని వారు చెప్పారు. అందుకు టీవీకే చీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోదసీలోకి భారత్ నిఘా ఉపగ్రహాలు

***మన శాటిలైట్లకు బాడీగార్డుల్లా రక్షణ కల్పించడమే లక్ష్యం***

ప్రస్తుతం శాటిలైట్ కమ్యూనికేషన్లు ప్రజల రోజువారీ కార్యకలాపాలకు అత్యంత ముఖ్యమైనవి. ఒక్కరోజు ఇవి ఆగిపోయినా, జనజీవనం స్తంభించిపోతుంది. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో వీటిని కాపాడుకోవడం చాలా ముఖ్యం. గతంలో అంతరిక్షంలో మన ఉపగ్రహాలు పలుమార్లు ప్రమాదాలను తృటిలో తప్పించుకొన్నాయి. అందుకే వాటికి రక్షణగా బాడీగార్డ్ శాటిలైట్స్‌ను తయారుచేయాలని కేంద్రం భావిస్తోంది.. ఇవి మన ఉపగ్రహాలకు పొంచివున్న ముప్పును ముందే గుర్తించి వాటిని అడ్డుకొంటాయి.




2024 సంవత్సరం మధ్యలో భూమికి 500-600 కిలోమీటర్ల ఎత్తులో మన ఉపగ్రహం పరిభ్రమిస్తోంది. దాదాపు అదే ఎత్తులో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ శాటిలైట్లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. మన పొరుగుదేశానికి చెందిన ఓ స్పేస్ క్రాఫ్ట్ కూడా గతంలో మన మిలిటరీ ఉపగ్రహానికి అత్యంత సమీపంలోకి వచ్చింది. రెండింటి మధ్య దూరం కిలోమీటర్ కంటే తక్కువ ఉంది. కొన్ని సందర్భాల్లో తమ శక్తి ప్రదర్శన కోసం ఆయా దేశాలు కావాలనే ఇటువంటి పనులు చేస్తాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.270 కోట్లతో 50 నిఘా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలని భావిస్తోంది. వీటిని వచ్చే సంవత్సరం ప్రయోగించవచ్చని భావిస్తున్నారు. గత 70 ఏళ్లలో పాప్ చైనాతో మన దేశం పలు యుద్ధాలు చేయాల్సివచ్చింది. వీటిల్లో చైనా అంతరిక్ష రంగంలో బాగా ముందడుగు వేసింది. పాకిస్థాన్కు మాత్రం ఎనిమిది ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయి. ఇక మన వద్ద వీటి సంఖ్య 100 దాటేసింది. చైనా వద్ద అందరికంటే ఎక్కువగా 890కి పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మన ఉపగ్రహాలకు పొంచి ఉన్న ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్రం స్టార్టప్ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఇందుకోసం లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్ శాటిలైట్స్‌ను పంపాలని యోచిస్తోంది. వీటివల్ల భూమి కమాండ్ సెంటర్ల నుంచి తక్షణం చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. వీటితోపాటు భూమిపై భారీ రాడార్లు, టెలిస్కోప్‌లు వంటి వాటితో వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఇస్రో కెపాసిటీ బిల్డింగ్ ఆఫీస్ మాజీ డైరెక్టర్ సుధీర్ కుమార్ వెల్లడించారు. 24 గంటలూ కక్ష్యలో జరిగే పరిణామాలను ట్రాక్ చేసే వ్యవస్థలు ప్రస్తుతం మన వద్ద లేవని పేర్కొన్నారు. కొన్ని స్టార్టర్లు ఇప్పుడు వాటిపై పనిచేస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ వేళ 400 మంది శాస్త్రవేత్తలు రేయింబవళ్లు పనిచేసి అవసరమైన కీలక సమాచారం సేకరించారు. ఈ విషయాన్ని ఈ నెల 8వ తేదీన జరిగిన ఓ సమావేశంలో ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలిపారు.

## సరిహద్దుల్లోనే కాదు..
# పాక్ నట్టింటికెళ్లి బుద్ధి చెప్పాం

**- తీరు మారకపోతే సిందూర్ ఆపరేషన్లు షరా మామూలే**

**- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక**

ఉగ్రవాదులకు మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్ విజయ విశేషాలను పంచుకున్నారు. 'సిందూర్ పార్ట్ 2' అనేది పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని దాయాదిని హెచ్చరించారు. "ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన జరిగిన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో జరిగిన సమావేశంలో వారిని నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. ఆపరేషన్‌కు మీరు సిద్ధమా? అని ప్రశ్నించాను. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు" అని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఆ తర్వాత ఏం జరిగిందో ప్రపంచమంతా చూసింది. కేవలం సరిహద్దుల్లోనే కాదు.. దాయాది భూభాగంలో 100 కిలోమీటర్లు లోపలికి వెళ్లి మరీ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబం చెల్లాచెదురైందని జైషే ఉగ్ర నాయకులే అంగీకరించారు. పాకిస్థాన్



అభ్యర్థించడం వల్లే కాల్పుల విరమణకు అంగీకరించాం. స్నేహితులు మారొచ్చు గానీ.. పొరుగువారు ఎప్పటికీ మారరు అని దివంగ ప్రధాని వాజ్‌పేయి చెబుతుండేవారు. అందుకే వారిని సరైన మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇక, ఆపరేషన్ సిందూర్ను ప్రస్తుతానికి నిలిపివేశాం. అది ఎప్పుడైనా మళ్లీ మొదలవ్వొచ్చు. సిందూర్ పార్ట్ 2, పార్ట్ 3 అనేది పాక్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. వారు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే గనుక మేం తగినవిధంగా బుద్ధి చెబుతాం" అని రాజ్నాథ్ సింగ్ హెచ్చరించారు.

# అమెరికా కంపెనీలపైనే భారం

- హెచ్1బీ వీసా ఫీజుల పెంపు ప్రభావం
- అక్కడి స్టార్టప్ సంస్థలకు సవాల్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకొచ్చిన హెచ్‌-1బీ వీసా ఫీజుల పెంపు అమెరికా కంపెనీలపైనే అధిక భారాన్ని మోపుతోంది. ఇది.. ఏటా ఆయా కంపెనీలపై దాదాపు 14 బిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు ఉంటుందని చెబుతున్నారు. హెచ్1బీ వీసా ఫీజు లక్ష డాలర్లు చేయడం ఆయా సంస్థలకు మోయలేని భారంగా మారే ప్రమాదం ఉందంటున్నారు. ఈ నిర్ణయం అమెరికాలోని స్టార్టప్ సంస్థలకు అతి పెద్ద భారం కానుందని స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన 'వై కాంబినేటర్' సీఈవో గారీటాన్ అంటున్నారు. అదే సమయంలో విదేశాల్లోని టెక్ హబ్‌లకు ఇది ఓ సానుకూల పరిణామంగా మారుతుందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.అయితే, ట్రంప్ తాజా నిర్ణయాన్ని కోర్టుల్లో సవాలు చేసే అవకాశం ఉందని కూడా అమెరికా న్యాయవాదులు అంటున్నారు. వీసాల ఫీజు పెంపు మీద ట్రంప్.. తన అధికారాల పరిధిని దాటి నిర్ణయం తీసుకొన్నారని చెబుతున్నారు. ట్రంప్ ప్రకటనను న్యాయస్థానాలు అడ్డుకొనే అవకాశం ఉందనీ అంచనా వేస్తున్నారు. వీసాలు లాటరీ విధానంలో కాకుండా.. జీతాల ఆధారంగా మంజూరు చేయాలని ఇప్పటికే కొందరు రిపబ్లికన్ చట్టసభ సభ్యులు డిమాండ్ చేస్తుండటం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే.





### ఒకే వేదికపై ట్రంప్, మస్క్..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు మస్క్‌ల మధ్య గత కొంతకాలం నుంచి పరిస్థితులు బొత్తిగా బాలేవు. కొన్ని నెలల ముందు వరకు ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండేలా పరిస్థితి ఉండేది. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించడానికి మస్క్ ఎంతో కృషి చేశారు. ఇద్దరూ దోస్త్ మేరా దోస్త్ అంటూ తిరిగేవారు. అయితే, ట్రంప్ తీసుకువచ్చిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' ఇద్దరి మధ్యా చిచ్చుపెట్టింది. దీన్ని మస్క్ వ్యతిరేకించారు. ఇద్దరి మధ్యా వార్ మొదలైంది. ప్రత్యక్షంగా ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు సైతం చేసుకున్నారు. ఆ బిల్లును ఆపాలని మస్క్ చాలా రకాలుగా ప్రయత్నించారు. బిల్లుకు మద్దతు ఇవ్వాలనుకున్న సెనేటర్లకు వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినా లాభం లేకపోయింది. బిల్లు ఆమోదం పొంది అమల్లోకి కూడా వచ్చింది. దీంతో మస్క్ తన కొత్తపార్టీని తెరపైకి తెచ్చారు. 'ది అమెరికా పార్టీ'ని ప్రారంభించారు. ఆ వెంటనే మస్క్ సైలెంట్ అయిపోయారు. చాలా రోజుల తర్వాత ట్రంప్, మస్క్ ఒకే వేదికపై కనిపించారు. తాజాగా, కన్జర్వేటివ్ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ మెమోరియల్ ఈవెంట్‌లో ఇద్దరూ పాల్గొన్నారు. ప్రైవేట్ బాక్సుల్లో ట్రంప్, మస్క్ పక్కపక్కనే కూర్చున్నారు. కొన్ని నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




## ఖలిస్థాన్ ఉగ్రవాది ఇంద్రజీత్ అరెస్ట్

ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్‌ను కెనడా అధికారులు అరెస్టు చేశారు. సిక్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గురుపత్వంత్ సింగ్ పన్నూన్‌కు ఇతను సన్నిహిత సహచరుడు. 2023లో సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య అనంతరం కెనడాలో ఎస్ఎఫ్‌జే కార్యకలాపాలను 36 ఏళ్ల గోసల్ చూసుకుంటున్నాడు. మారణాయుధాల ఆరోపణల కింద ఒట్టావాలో గోసల్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఏడాది కాలంలో గోసల్ అరెస్టు కావడం ఇది రెండోసారి. 2023లో నవంబర్‌లో గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనకు సంబంధించి అతన్ని అరెస్టు చేశారు. అనంతరం పీల్ రీజనల్ పోలీసులు అతన్ని షరతులతో విడుదల చేశారు. ఆ సమయంలో కెనడాలోని ఖలిస్థానీ రిఫరెండం కార్యకలాపాలకు కీలక వ్యూహకర్తగా గోసల్‌ను చెప్పుకునేవారు. ఎస్ఎఫ్‌జే వ్యవస్థాపక నేతల్లో ఒకరైన పన్నూన్‌కు విశ్వసనీయ సహచరుడిగా పేరున్న గోసల్ ఆయనకు బాడీగార్డ్‌గానూ వ్యవహరించేవాడు. గ్రూప్ ఓవర్సీస్ ఆపరేషన్లలో కీలక పాత్రధారిగా వ్యవహరించేవాడు.

## అంగుళం కూడా వదులుకోము..

### ట్రంప్‌కు తెల్చి చెప్పిన తాలిబన్

బాగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగిచ్చేయాలంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తాలిబన్లు గట్టిగా బదులిచ్చారు. అఫ్గాన్ భూభాగంలో అంగుళం కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రాజధాని కాబుల్‌కు ఉత్తరాన బాగ్రామ్ వాయుసేన స్థావరం ఉంది. యావత్ దేశంలో ఇదే అతి పెద్ద వాయుసేన స్థావరం. అమెరికా మిలిటరీ దాదాపు 20 ఏళ్ల పాటు ఇక్కడి నుంచే తన కార్యకలాపాలు నిర్వహించింది. అఫ్గానిస్థాన్ తాలిబన్‌ల వశమయ్యాక అమెరికా సేనలు బాగ్రామ్ విడిచిపెట్టి స్వదేశానికి పయనమయ్యాయి. ట్రంప్ కామెంట్స్‌పై ఇటీవల అఫ్గానిస్థాన్ రక్షణ శాఖ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఫసీహుద్దీన్ ఫిత్రత్ స్పందించారు. ఏదోక రాజకీయ డీల్ ద్వారా ఈ స్థావరాన్ని కొందరు మళ్లీ దక్కించుకోవాలని చూస్తున్నట్టు తెలిపారు. చర్చలు కూడా జరుపుతున్నామని వాళ్లు చెప్పుకుంటున్నట్టు తెలిపారు. అయితే, అఫ్గాన్ భూభాగానికి చెందిన ఒక అంగుళం నేలపైనా ఎలాంటి డీల్ కుదరదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అఫ్గానిస్థాన్ ప్రభుత్వం కూడా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమ స్వాతంత్ర్యానికి, ప్రాదేశిక సమగ్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తామని పేర్కొంది.



# సొంత ప్రజలపైనే బాంబుల వర్షం

- పాక్ దళాల వైమానిక దాడులు
- 30 మంది పైనే సామాన్యుల బలి



పాక్ పాలకులు మరో దారుణానికి తెగబడ్డారు. ఉగ్రవాద ఏరివేత చర్యల పేరిట యుద్ధ విమానాలతో బాంబుల వర్షం కురిపించడంతో ఏకంగా 30 మంది సామాన్య ప్రజలు కన్నుమూశారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. ఖైబర్ పాఖ్‌తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో పాష్‌తూన్ తెగ ప్రజలు అత్యధికంగా ఉండే మాట్రే దారా గ్రామంపై ఈ దాడి జరిగింది. సోమవారం తెల్లవా రుజామును సుమారు 2 గంటల సమయంలో జేఎఫ్‌-17 విమానాలు ఎల్ఎస్‌-6 బాంబులతో దాడులు చేసి అమాయకుల ప్రాణాలు పొట్టనపెట్టుకున్నాయి. దాడుల కారణంగా ఆ గ్రామం ధ్వంసమైపోయింది. ఈ దాడుల్లో అనేక మంది గాయపడ్డారు. అయితే పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది. గ్రామంలో దాక్కున్న తెహ్రీక్ ఏ పాకిస్థాన్ సంస్థ ఉగ్రవాదులను ఏరివేసేందుకు పాక్ ఈ దాడి చేసిందని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ దాడి బాధితులందరూ సామాన్యులేనని తెలిపింది. పర్వత ప్రాంతమైన ఖైబర్ పాఖ్‌తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఇటీవల పాక్ దళాలు ఉగ్రవాదుల ఏరివేత పేరిట పలు దాడులు చేశాయి. నిఘా వర్గాలు దేరా ఇస్మయిల్ ఖాన్ జిల్లాలో జరిపిన దాడిలో ఆదివారం ఏడుగురు టెర్రరిస్టులు మృతిచెందినట్టు పాక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇక సెప్టెంబర్ 13-14 మధ్య ఇదే ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో సుమారు 31 టీటీపీ ఉగ్రవాదులు హతమయ్యారు. అఫ్గానిస్థాన్ సరిహద్దులోని పాక్ ప్రావిన్స్‌ల్లో ఇటీవల ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయి.

# చైనా 'కే' వీసా..హెచ్1కు పోటీగా సిద్ధం



ప్రపంచవ్యాప్తంగా స్టెమ్ రంగాల యువ నిపుణులను ఆకర్షించేందుకు చైనా కొత్త వీసాను ప్రారంభించేందుకు సన్నద్ధమైంది. కే వీసా పేరిట అక్టోబర్ ఒకటి నుంచి దీన్ని లాంచ్ చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించింది. అయితే, హెచ్‌-1బీ వీసాపై ఆంక్షల నేపథ్యంలో చైనా కే-వీసాను లాంచ్ చేసిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్టెమ్ రంగాలకు చెందిన యువ నిపుణులను చైనాకు ఆకర్షించడమే ఈ వీసా లక్ష్యమని చెబుతున్నారు. ముఖ్యంగా దక్షిణాసియా వారిని దృష్టిలో పెట్టుకుని ఈ వీసాను చైనా ప్రారంభించిందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. చైనా న్యాయ శాఖ ప్రకారం, సైన్స్, టెక్నాలజీ రంగాల్లోని యువ నిపుణుల కోసం ఈ వీసాను సిద్ధం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ యూనివర్సిటీలు, రీసెర్చ్ సంస్థల్లో స్టెమ్ రంగాల్లో బ్యాచ్‌లర్స్, ఆపై డిగ్రీలు చేసిన యువత ఈ వీసాకు అర్హులు. ప్రముఖ సంస్థల్లో బోధన, పరిశోధన చేస్తున్న యువ నిపుణులకు కూడా ఈ వీసాను జారీ చేస్తారు. ఈ వీసా కోసం కావాల్సిన ఇతర డాక్యుమెంట్స్ వివరాలను చైనా ప్రభుత్వం ఇంకా ప్రచురించాల్సి ఉంది. ప్రస్తుతం చైనా జారీ చేస్తున్న 12 రకాల వీసాల కంటే కే-వీసా నిబంధనలు మరింత సరళతరం. పలు మార్లు చైనాకు వచ్చి వెళ్లే సదుపాయం, అధిక వీసా గడువు వంటి ఫీచర్లు ఉన్నాయి. కే-వీసా ఉన్న వారు ఉద్యోగ వ్యాపారాలతో పాటు విద్యా సంబంధిత అంశాల్లో కూడా పాలుపంచుకోవచ్చు. అంతేకాకుండా, చైనా సంస్థల నుంచి ఎటువంటి ముందస్తు ఉద్యోగ ఆఫర్‌లు లేకపోయినా ఈ వీసాను జారీ చేస్తారు. అంతర్జాతీయ నిపుణులను ఆకర్షించే ప్రణాళికలో భాగంగా చైనా.. వలసల నిబంధనలను మరింతగా సడలిస్తోంది. ఇందులో భాగంగానే కేవీసాను ప్రకటించింది. ఇప్పటికే 55 దేశాల పర్యాటకులకు చైనా 240 గంటల గడువుతో వీసా ఫ్రీ ట్రాన్సిట్ సదుపాయాన్ని ఆఫర్ చేస్తోంది. మరో 75 దేశాల వారికి వీసా నిబంధనల్లో ఇతర అనేక సడలింపులు కూడా ప్రకటించింది. అధికారిక డాటా ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్థంలో దాదాపు 38 మిలియన్‌ల మంది ఫారినర్లు చైనాలో పర్యటించారు.

# పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించిన యూకే, కెనడా

లండన్: పాలస్తీనాపై యూకే, కెనడా సంచలన నిర్ణయంతో చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా యునైటెడ్ కింగ్‌డమ్ ఆదివారం నాడు అధికారికంగా గుర్తించాయి. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వ్యతిరేకత ఎదురైనప్పటికీ యూకే, కెనడా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మధ్య ప్రాచ్యంలో సుస్థిర శాంతి నెలకొనేందుకు ద్విదేశ విధానానికి ఒట్టావా మద్దతిస్తోందని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు 'సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య, సుస్థిర పాలస్తీనా' ఏర్పాటు కీలకమని పేర్కొంది.

# భారత్, పాక్ మూడోసారి తలపడతాయా..



ఆసియా కప్‌లో టీమిండియా, పాకిస్థాన్ ఇప్పటికి రెండుసార్లు తలపడ్డాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ చేతుల్లో పాక్‌కు పరాభవమే మిగిలింది. అదే విధంగా ఫైనల్లో కూడా పాకిస్థాన్‌ను చిత్తు చేసి టీమిండియా కప్పును ముద్దాడితే ఆ ఆనందమే వేరుగా ఉంటుందని అభిమానులు అంటున్నారు. ఈ రెండు జట్లు ఫైనల్లో తలపడే అవకాశం ఉందా.. అంటే ఉంటుంది.

ఈ టోర్నీలో ఇప్పటికే రెండుసార్లు భారత్, పాక్‌లు తలపడగా.. టీమ్ ఇండియానే విజయం వరించింది. తొలి మ్యాచ్‌కు పెద్దగా ఆదరణ దక్కలేదు. కానీ, సూపర్ -4 మ్యాచ్‌కు మాత్రం భారీగానే ప్రేక్షకులు, అభిమానులు వీక్షించారు. దీంతో మరోసారి ఇరుజట్లూ తలపడే అవకాశం ఉందా? అనే చర్చ మొదలైంది. రెండు మ్యాచుల్లో గెలిచినా.. భారత్ ఎక్కువగా సంబరాలు చేసుకోలేదు. పాక్ ప్లేయర్లు ఎంత కవ్వించినా టీమ్ ఇండియా ఆటగాళ్లు పట్టించుకోలేదు. ఫైనల్‌కు పాక్ చేరుకొని.. మరోసారి ఓడించి సగర్వంగా టైటిల్‌ను తీసుకురావాలనేది భారత క్రికెట్ అభిమానుల ఆకాంక్ష. మరి అలా జరగాలంటే ఈ సమీకరణాలు కావాల్సిందే.

**భారత్ ఫైనల్‌కు రావాలంటే..**

సూపర్-4 దశకు భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఒక్కో జట్టు మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడాలి. ఇందులో టాప్ -2లో నిలిచిన టీములు ఫైనలుకు చేరతాయి. ఇప్పటికే పాక్‌పై భారత గెలవడంతో... మిగిలిన రెండు మ్యాచుల్లో బంగ్లా, శ్రీలంకతో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా భారత్ ఫైనల్‌కు దూసుకెళ్తుంది. అప్పుడు ఆరు పాయింట్లు టీమ్ ఇండియా ఖాతాలో ఉంటాయి. అప్పుడు, మూడు మ్యాచులు గెలిచే అవకాశం మరే ఇతర జట్టుకూ ఉండదు. కనీసం ఒక్క విజయం నమోదు చేసినా ఫైనల్ బెర్తు మనదే. దుబాయ్ వేదికగా సెప్టెంబర్ 24న బంగ్లాదేశ్‌తో, 26న శ్రీలంకతో భారత్ ఆడాల్సి ఉంది.

**పాక్‌కు ప్రతి మ్యాచ్ కీలకమే..**

తొలి మ్యాచ్ లోనే ఓడిపోవడంతో మిగిలిన రెండు మ్యాచులు పాకిస్థాన్‌కు అత్యంత కీలకం. ఏ మాత్రం తేడా వచ్చినా ఇంటిముఖం పట్టడం ఖాయం. శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాక్ తలపడాల్సిఉంది. ఈ నెల 23న అబుదాబిలో శ్రీలంకతో, 25న దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో పాకిస్థాన్ ఆడాల్సి ఉంది. ఇప్పటికే తొలిమ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన బంగ్లా పైచేయి సాధించింది. ఈ రెండు జట్లను ఓడించడం ఇప్పుడు ఉన్న పాక్‌కు తేలికేమీ కాదు. ఈ రెండు మ్యాచుల్లో పాక్ గెలిచి., మెరుగైన నెట్ రన్‌రేట్ సాధిస్తేనే ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇప్పటివరకు ఆసియా కప్‌లో మూడుసార్లు భారత్-పాకిస్థాన్ ఎప్పుడూ తలపడలేదు. ఒకవేళ ఇప్పుడు ఫైనల్‌కు చేరితే తొలిసారి ఒకే టోర్నీలో ఈ రెండు జట్లు మూడుసార్లు తలపడినట్లు అవుతుంది.

## అగ్రస్థానంలో అమెరికా



ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో అమెరికా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. టోక్యో ఛాంపియన్ షిప్‌ను ఆ దేశం అగ్రస్థానం (26 పతకాలు) తో ముగించింది. ఇందులో 16 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు ఉన్నాయి. చివరి రోజు, ఆదివారం 4x100 మీటర్ల రిలేలో అమెరికా 'డబుల్' సాధించింది. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలోనూ పసిడి కూడా అమెరికా ఖాతాలోనే చేరింది. మహిళల టీమ్ లో షెరికా రిచర్డ్సన్, మెలిసా జెఫర్సన్, పురుషుల్లో నోవా లైల్స్, కోల్మన్.. అమెరికా విజయాల్లో కీలకపాత్ర పోషించారు. కెన్యా 11 పతకాలు (7 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలు), కెనడా 5 (3 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యం) రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి.

## పాక్..మాకు సమఉజ్జీ కాదు



పాకిస్థాన్ తమకు సమఉజ్జీ కాదని టీమిండియా టీ 20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఆసియా కప్ సూపర్-4లో పాకిస్థాన్‌ను టీమ్ ఇండియా మట్టికరిపించింది. గత ఆరు మ్యాచుల్లో ఒక్కసారి కూడా పాక్ గెలవలేదు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ పరోక్షంగా పాక్‌పై భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇంకెప్పుడూ పాక్‌ను తమకు సమఉజ్జీ అనొద్దని సూర్య కోరాడు. ఇకనుంచి సమఉజ్జీ అనే పదం వాడొద్దు. నా అభిప్రాయం ప్రకారం.. ఏవైనా రెండు జట్లు ఓ 20 మ్యాచుల్లో తలపడ్డాయనుకుందాం. 11-9 లేదా, 10-10తో ఉంటే బాగా ఆడాయని అనుకోవచ్చు. అప్పుడు సరైన సమఉజ్జీలు అని పిలవచ్చు. కానీ, 13-0, 10-1. ఇలాంటి గణాంకాలు నమోదైతే అక్కడ పోటీ ఏముంది.. సమఉజ్జీ అని పిలిచేంత ఏమీలేదు. పాక్‌పై అత్యుత్తమ క్రికెట్ ఆడాం కాబట్టి విజయం సాధించాం. గత వారం ఆడిన పిచ్ కంటే ఈ సారి బాగుంది. బ్యాటింగ్ చేయడానికి అనుకూలంగా ఉంది. ఎవరైతే 7-15 ఓవర్ల మధ్య మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తారో వారే గెలుస్తారు. మేం ఆ విషయంలో పైచేయి సాధించాం. మా బౌలింగ్‌పై ఆందోళన ఏమీ లేదు. బుమ్రా బౌలింగ్ గురించి మాట్లాడుతూ ఒక్క మ్యాచ్‌లో సరిగ్గా వేయనంత మాత్రాన ఏమీ కాదు.. అతడేమీ రోబో కాదు.. ఈ మ్యాచ్‌లో కలిసిరాలేదు అంతే అని సూర్య అన్నాడు. అభిషేక్, గిల్, దూబే అదరగొట్టారు. ఫీల్డింగ్ మాత్రం మెరుగుపడాల్సి ఉందని సూర్య అంగీకరించాడు.

## అభిషేక్ సెంచరీ కోసం చూస్తున్నాం..



అభిషేక్ శర్మ సెంచరీ కోసం ఎదురుచూస్తున్నామని అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసియా కప్ సూపర్-4 మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత ఓపెనర్ అభిషేక్ శర్మ విరుచుకుపడ్డాడు. కేవలం 39 బంతుల్లోనే 74 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సెంచరీ చేస్తాడని అనుకుంటే.. చేజార్చుకున్నాడు. ఈ టోర్నీలో అభిషేక్ సెంచరీ చేస్తాడని అతడి కుటుంబసభ్యులు ఆకాంక్షించారు. ఆసియా కప్ మ్యాచ్ కోసం అభిషేక్ శర్మ తల్లి మంజు శర్మ, సోదరి కోమల్ శర్మ దుబాయ్‌కి వచ్చారు. పాక్‌తో మ్యాచ్ అనంతరం అక్కడ మాట్లాడుతూ ఆనందం వ్యక్తంచేశారు. అభిషేక్ ఆట చూడటం బాగుంది. పాక్‌పై ఆడిన ఇన్నింగ్సును ఎంతగానో ఆస్వాదించాం. తొలి బంతికే సిక్స్ కొట్టడం మరిచిపోలేం. ప్రత్యర్థి బౌలర్ ఎవరనేది చూడకుండా ధైర్యంగా ఆడేస్తాడు. దానిని ఓ అలవాటుగా మార్చుకున్నాడు. మీ అందరి మద్దతు ఇలాగే ఉంటే.. దేశం కోసం మరిన్ని అద్భుతమైన ఇన్నింగ్స్ లు ఆడతాడు. ఈ టోర్నీలో తప్పకుండా సెంచరీ చూస్తామని ఆశిస్తున్నా" అని మంజు తెలిపారు.

ప్రతిసారి భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ చూడాలనుకుంటా. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశా. అభిషేక్ అద్భుతంగా ఆడాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. ఇంతకంటే ఇంకే కావాలి? అసలు ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. అద్భుతమైన టాలెంట్ కలిగిన ప్లేయర్. అతడికి ఆకాశమే హద్దు. త్వరలోనే అతడి బ్యాట్ నుంచి సెంచరీ రావాలని కోరుకుంటున్నా. దానికోసమే వెయిటింగ్ అని కోమల్ వెల్లడించారు.

**చిన్నప్పటి నుంచి కలిసి ఆడాం: అభిషేక్**

పాకిస్థాన్ ఆటగాళ్లు ఎలాంటి కారణం లేకుండానే మా వైపు వచ్చారు. నేను పెద్దగా ఆసక్తి చూపించను. కానీ, అదేపనిగా వస్తుండటంతో గట్టిగా బదులిచ్చాం. జట్టు కోసం మంచి ఇన్నింగ్స్ ఆడాలనే లక్ష్యంతో ఉన్నా. అలాంటప్పుడు వీటిని పెద్దగా పట్టించుకోను. శుభ్‌మన్ గిల్‌తో కలిసి చిన్నప్పటి నుంచి ఆడుతున్నా. మేమిద్దరం ఆటను ఆస్వాదిస్తాం. గిల్ మళ్లీ పుంజుకోవడం ఆనందంగా ఉంది. మేనేజ్మెంట్ మద్దతుగా ఉండటం వల్లే స్వేచ్ఛగా ఆడగలిగామని అభిషేక్ తెలిపాడు.

## ఓటమికి కారణం కెప్టెనే..



భారత్ చేతిలో తమ జట్టు ఓడిపోవడానికి ప్రధాన కారణం కెప్టెన్ సల్మాన్ అఘానేనని పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ విమర్శించాడు. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాడో.. అతడికైనా అర్థమవుతుందా అని ప్రశ్నించాడు. భారీ స్కోరు చేయాల్సిన సమయంలో ముందు బ్యాటింగ్‌కు రాకపోవడంపై అక్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. జట్టులో అతడే అత్యంత బలహీనమైన ప్లేయర్ అని వ్యాఖ్యానించాడు. కెప్టెన్‌గా ఇప్పటి వరకు సల్మాన్ అఘా ఏం చేశాడో తెలియడం లేదు.

జట్టుకు సారథ్యం వహించేటప్పుడు చాలా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, మా జట్టు అత్యంత బలహీనంగా కనిపించడానికి కారణం కెప్టెనే. కానీ, దీని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. అతడు ఏ స్థానంలో బ్యాటింగ్ చేయాలి? అనేదానిపై స్పష్టత లేదు.

ఆరో స్థానంలో వచ్చాడు.. అక్కడైనా దూకుడుగా ఆడాడా.. అంటే అదీ లేదు. భారత జట్టులో తిలక్, హార్దిక్ పాండ్యను చూడండి. వారి బ్యాటింగ్ లోతు అలాంటిది. జట్టుకు సల్మాన్ చేసిందేమీ లేదని అక్తర్ విమర్శించాడు.

**పాక్ ఆటగాళ్ల వైఖరి సరికాదు**

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆసియా కప్ మ్యాచులు జరుగుతున్నాయి. ఇలాంటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ క్రికెటర్లు తమ 'చేష్ట'లతో సొంత జట్టు మాజీల నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. భారత ఆటగాళ్లతో హారిస్ రౌఫ్, షహీన్ మాటల యుద్ధం చేయడం, హాఫ్ సెంచరీ ముగిశాక ఫర్హాన్ చేసిన 'గన్ షాట్' సైగలు సరైనవి కావంటూ పాక్ టీవీలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఓ ప్యానలిస్ట్ వ్యాఖ్యానించాడు. ఆ డిబేట్లో మాజీ క్రికెటర్లు కమ్రాన్ అక్మల్, బసిత్ అలీ కూడా ఉండటం గమనార్హం.

## డీకాక్.. వన్డేల్లో రిటైర్‌మెంట్ వెనక్కి



దక్షిణాఫ్రికా ఆటగాడు క్వింటన్ డికాక్ వన్డేల్లో తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. అతడు 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఆ టోర్నీలో అతడు 594 పరుగులు చేశాడు. అలాగే క్వింటన్.. టీ20 వరల్డ్ కప్ 2024 సౌతాఫ్రికా జట్టులోనూ ఆడాడు. టీ20 ఫార్మాట్‌కు అతడు రిటైర్మెంట్ అయితే ప్రకటించలేదు కానీ.. టీ20 వరల్డ్ కప్ తర్వాత నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్ ఆడటం మీద దృష్టి పెట్టాడు. అతడు అంతర్జాతీయంగా.. చివరిసారి టీ20 వరల్డ్ కప్ 2024లో టీమ్ ఇండియాతో సౌతాఫ్రికా తలపడిన ఫైనల్ మ్యాచ్‌లో కనిపించడం గమనార్హం.

క్వింటన్ డికాక్ పునరాగమనం గురించి దక్షిణాఫ్రికా కోచ్ షుక్రీ కాన్రాడ్ మాట్లాడుతూ అతడి రాక జట్టుకు ఎంతో బలాన్నిస్తుందన్నాడు. క్వింటన్ జట్టులోకి తిరిగి రావడం మాకు సానుకూలాంశం. మేం గత నెలలో అతడితో మాట్లాడాం. అతడు ఇప్పటికీ దేశం తరపున ఆడేందుకు ఉత్సాహంగా ఉన్నాడు. అతడి శక్తి, సామర్థ్యాల గురించి అందరికీ తెలుసు. అతడు తిరిగి రావడం జట్టుకు ఎంతో ప్రయోజనకరమని దక్షిణాఫ్రికా కాన్రాడ్ అన్నాడు.

దక్షిణాఫ్రికా.. అక్టోబర్ 12 నుంచి పాకిస్థాన్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో రెండు టెస్టులు, మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. వన్డే, టీ20 జట్లలో డీ కా క్‌కు చోటు దక్కింది.

చైతన్య రథం
# సినిమా
మంగళవారం 23 సెప్టెంబర్ 2025


## ఓజీ ట్రైలర్ వచ్చేసింది..

పవన్ కల్యాణ్ అభిమానులతోపాటు తెలుగు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన 'ఓజీ' ట్రైలర్ వచ్చేసింది. ఆదివారం ఉదయమే రిలీజ్ చేస్తామని చెప్పిన చిత్ర బృందం.. తాజాగా సోమవారం విడుదల చేసింది. ట్రైలర్‌లో పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్స్, తమన్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటున్నాయి. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పవన్ గ్యాంగ్ స్టర్ ఓజాస్ గంభీరగా నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్ర పోషించారు. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్. ఈ సినిమా ఈ నెల 25న భారీ అంచనాలతో బాక్సాఫీసు ముందుకు రానుంది.






## 'అధీర' అప్‌డేట్..

తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా పీవీసీయూలో రానున్న 'అధీర'పై ఆయన అప్డేట్ ఇచ్చారు. ఇందులో ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు.. వెలుగు రూపంలో ఆశాకిరణం పుట్టుకొస్తుంది' అంటూ 'అధీర' నుంచి ఆసక్తికర పోస్టర్‌ను పంచుకున్నారు. ప్రశాంతవర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ సూపర్ హీరో ఫిల్మ్ రానున్నట్లు తెలిపారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

తన సినిమాటిక్ యూనివర్స్‌కు సంబంధించి ప్రస్తుతం 20 స్క్రిప్టులు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ వివరించారు. ఇందులోభాగంగా ఇప్పటికే 'మహాకాళి'ని ప్రకటించారు. ఇప్పుడు 'అధీర'పై అప్‌డేట్ ఇచ్చారు.

## అభిమానుల నిస్వార్థమైన ప్రేమే కారణం..




తాను 155 సినిమాలు పూర్తి చేశానంటే అభిమానుల నిస్వార్థమైన ప్రేమే అందుకు కారణమని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. తన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' విడుదలై సోమవారానికి 47 ఏళ్లు అయిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఆ చిత్రాన్ని గుర్తుచేసుకుంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

నటుడిగా తనకు ఈ చిత్రం ప్రాణం పోసిందన్నారు. 22 సెప్టెంబర్ 1978.. కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే నేను 'ప్రాణం ఖరీదు' చిత్రంతో మీకు పరిచయమయ్యాను. ఈ సినిమా విడుదలై నేటికి 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ సినిమా ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా, ఒక మెగాస్టార్‌గా అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు ఎప్పుడూ కృతజ్ఞుడినై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే.. అందుకు కారణం నిస్వార్థమైన మీ ప్రేమే. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలు నావి కావు, మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా.. అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

చిరంజీవి కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'పునాది రాళ్లు. అయితే, ఆ తర్వాత నటించిన 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదల కావటం గమనార్హం. కె.వాసు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిరు నరసింహ అనే పాత్రను పోషించారు. రావుగోపాలరావు, జయసుధ, చంద్రమోహన్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమా విడుదలై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరుకు సోషల్ మీడియాలో సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు'లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే వశిష్ట దర్శకత్వంలో 'విశ్వంభర'తో సందడి చేయనున్నారు. 2026 వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ రెండింటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు సినిమాలు లైన్‌లో ఉన్నాయి.

## రణ్‌బీర్ కపూర్‌పై చర్యలు..

### జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశం



ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టాన్ని బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ఉల్లంఘించారని తేల్చిన జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) ఆయనపై చర్యలకు సిద్ధమైంది. అతడిపై కేసు నమోదు చేయాలని ముంబయి పోలీసులను ఆదేశించింది. షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ తెరకెక్కించిన 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ వెబ్ సిరీస్‌లో రణ్‌బీర్ అతిథి పాత్ర పోషించారు. అందులో ఎలక్ట్రానిక్ సిగరెట్ల చట్టాన్ని అతిక్రమించి, ఇ- సిగరెట్‌ను వినియోగిస్తూ రణ్‌బీర్ నటించడంపై ఆయనతోపాటు ఆ సిరీస్ నిర్మాతలు, స్ట్రీమింగ్ ప్లాట్ఫామ్ నెట్‌ఫ్లిక్స్ పైనా కేసు నమోదు చేయాలని ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశించింది.

యువతను తప్పుదోవ పట్టించే ఇలాంటి కంటెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది. భారత్‌లో 2019లో ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం అమల్లోకి వచ్చింది. దీని కింద ఇ-సిగరెట్ల ఉత్పత్తి, తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకాలు, పంపిణీ, నిల్వ, ప్రకటనలపై నిషేధం ఉంది.

'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ తోనే ఆర్యన్ దర్శకుడిగా ప్రేక్షకులకు పరిచయమయ్యాడు. లక్ష్య, బాబీ దేవోల్, సహేర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సిరీస్‌లో పలువురు బాలీవుడ్ స్టార్లు అతిథి పాత్రల్లో కనిపించారు. షారుక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, అమిర్ ఖాన్, తదితరులతోపాటు టాలీవుడ్ డైరెక్టర్ రాజమౌళి కూడా సందడి చేయడం విశేషం. ఈ సిరీస్ ఈ నెల 18న విడుదలైంది.

## రన్ రాజా రన్.. కథ అలా వచ్చింది

'రన్ రాజా రన్... తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్న యువ దర్శకుడు సుజీత్. ఈ సినిమా ప్రభావంతోనే సుజీత్ కు ప్రభాస్ 'సాహో' అవకాశమిచ్చారు. ఇప్పుడు ఏకంగా మరో అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ హీరోగా ఓజీ ని తీర్చిదిద్దారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 25న పాన్ ఇండియా మూవీగా విడుదల కానుంది. అయితే, కెరీర్ తొలి నాళ్లలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని సుజీత్ ఈ సందర్భంగా పంచుకున్నారు.



“అవకాశాల కోసం బాగా తిరుగుతూ... ఓ మంచి ప్రేమ కథ రాసుకున్నా. తొలి చిత్రంగా ఇదైతేనే బాగా ఉంటుందని భావించా. 'రన్ రాజా రన్' కంటే ముందు నిర్మాతలకు వినిపించా. ఫస్ట్ హాఫ్ వారికి బాగా నచ్చింది. సెకండాఫ్ కోసం దాదాపు 5 నెలలు రాత్రింబవళ్లు ఆలోచించి మంచి వెర్షన్ రాశా. ప్రొడక్షన్ ఆఫీసుకు వెళ్లి సెకండాఫ్ వినిపించా. వాళ్లు సూపర్ అన్నారు. ఇక ప్రాజెక్టు ఓకే అయ్యిందన్న ఆనందంతో బండిపై బయలుదేరా. దారిలోనే వాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. 'చూద్దామ్మా ఈ కథకు బడ్జెట్ ఎక్కువయ్యేట్లు ఉంది.. వేరే కథ ఉంటే చెప్పు' అన్నారు.

ఒక్కసారిగా చేష్టలుడిగిపోయా. అప్పుడే వర్షం మొదలైంది. అక్కడే రోడ్డు పక్కన కూర్చొని మూడు గంటల పాటు ఏడ్చాను. వెన్నెల కిషోర్‌కు ఫోన్ చేశా. అతను కాస్త ధైర్యం ఇచ్చాడు. నువ్వు షార్ట్ ఫిల్మ్ గంటలో రాయగలవు... సినిమా ఒక రోజులో రాయలేవా?' అని నన్ను ప్రోత్సహించాడు. ఆ ఉత్సాహంలో జోరుగా అక్కడి నుంచి లేచి బయలు దేరదామని బండి స్టార్ట్ చేద్దామని చూస్తే పెట్రోల్ అయిపోయింది. చేతిలో చిల్లగవ్వ లేదు. జోరున వాన. బండిని అలా నెట్టుకుంటూ జూబ్లీహిల్స్ నుంచి ముషీరాబాద్ వరకూ వచ్చాను. ఆ ప్రయాణంలో ఎన్నో ఆలోచనలు... బాధ, కోపం, కసి అన్నీ రకాల భావాలు వచ్చాయి. అదే ఆలోచనలతో ఇంటికి వస్తే.. బుర్రలో 'రన్ రాజా రన్' కథ మెరిసింది. వెంటనే ప్రొడక్షన్ వాళ్లకు ఫోన్ చేసి 'సంవత్సరం నుంచి ఓ కథ రాస్తున్నా... చెప్పమంటారా?' అని అడిగా. మూడు రోజుల్లో వస్తానని చెప్పి... 'రన్ రాజా రాన్' కథ మొత్తం రాసి తీసుకెళ్లా. ఒక్క డైలాగ్ కూడా మార్చకుండా... ఓకే చేశారు. ఒక ఓటమి వచ్చిందని బాధ పడకూడదు... మరో ప్రయత్నం మనల్ని విజయతీరాలకు చేరుస్తుందని సుజీత్ అన్నారు.

## జాక్వెలిన్‌కు సుప్రీంలో చుక్కెదురు

మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఉన్న రూ.200 కోట్ల ఈడీ కేసును కొట్టివేయాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆ పిటిషన్ ను తిరస్కరించింది. ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ.200 కోట్ల దోపిడీ కేసులో జాక్వెలిన్‌ను ఈడీ నిందితురాలిగా పరిగణించిన సంగతి తెలిసిందే. దోపిడీ చేసిన డబ్బు నుంచి నటి లబ్ది పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. సుకేశ్ చంద్రశేఖర్ దోపిడీదారు అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు రూ.200కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడైన సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు వార్తలు వచ్చాయి. అత్యంత ఖరీదైన డిజైనర్ బ్యాగులు, జిమ్ సూట్లు, వజ్రాల చెవిపోగులు, బ్రాస్లెట్, మినీ కూపర్.. ఇలా దాదాపు రూ.10కోట్ల విలువైన కానుకలను జాక్వెలిన్, ఆమె కుటుంబసభ్యులకు సుకేశ్ ఇచ్చినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌పై ఉన్న ఈడీ కేసును కొట్టివేయడం కుదరదంటూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ జాక్వెలిన్ సుప్రీంను ఆశ్రయించారు. జాక్వెలిన్ పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.